News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :175 | ఖమ్మం | శనివారం, ఆగస్టు 9, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

రాజధానిలో తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలకు సంబంధించి మరో వందేళ్ల అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక సిద్ధం చేయండి. ఎంత వర్షం పడినా గ్రేటర్ హైదరాబాద్‌లో నీరు నిల్వ ఉండకూడదు. వరద నీటితో ముంపు ఏర్పడకూడదు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితంగా ఉండాలి. సీఎం రేవంత్‌రెడ్డి

# మూసీ పునరుజ్జీవమే వరదకు పరిష్కారం

- నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండకూడదు
- నగరంలో ఎక్కడ వర్షం పడినా వరద నీరు మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



మూసీ పునరుజ్జీవమే వరద సమస్యకు శాశ్వత పరిష్కారమని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని వరదనీరు మూసీని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టంచేశారు. రాజధానిలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా... జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే అత్యవసరంగా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని అధికారులను అప్రమత్తం చేశారు. ఢిల్లీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... గురువారం రాత్రి హైదరాబాద్‌లో

వివరాలు 2లో..



# ముగ్గురు తప్ప అందరూ బాధితులే

- కుమార్తె, అల్లుడినీ వదలకుండా ఫోన్లపై నిఘా ఉంచారు
- ఫోన్ ట్యాపింగ్‌తో కేటీఆర్ రూ.కోట్లు తీసుకున్నారు
- బండి సంజయ్ ఆరోపణ.. సిట్‌కు వాంగ్మూలం

భారాస ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్, సంతోష్‌రావుల ఫోన్లు తప్ప అందరి ఫోన్లు ట్యాప్ అయ్యాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ట్యాపింగ్ భయంతో హరీశ్‌రావు ఏడాదిపాటు ఫోన్ వినియోగించలేదన్నారు. ఫోన్ల అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట వాంగ్మూలమిచ్చేందుకు బండి సంజయ్ శుక్రవారం దిల్‌కుషా అతిథిగృహానికి వచ్చారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. “నా వద్ద ఉన్న ఆధారాలతో సిట్‌కు నివేదిక ఇచ్చాను. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్‌కాల్స్‌నే ట్యాప్ చేశారు. నేనే తొలి బాధితుడిని. ఢిల్లీ నుంచి నాకు, మా సిబ్బందికి వచ్చిన ఫోన్లనూ ట్యాప్ చేశారు. మావోయిస్టుల నియంత్రణకు వినియోగించాల్సిన ఎస్ఐబీని కేసీఆర్, కేటీఆర్‌లు రాజకీయ నిఘా కోసం వాడుకున్నారు. రాజకీయనేతలు, వ్యాపారులు, న్యాయవాదులు, సినిమా ప్రముఖులు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లనూ ట్యాప్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజి కేసును పర్యవేక్షిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్‌నూ ట్యాప్ చేశారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావుల ఫోన్లూ ట్యాప్ అయ్యాయి. భార్యాభర్తల ఫోన్లు కూడా వినడం దారుణం. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరూ సాధారణ కాల్స్ మాట్లాడలేకపోయారు. వాట్సప్, సిగ్నల్, ఫేస్‌టైంలో మాత్రమే మాట్లాడే పరిస్థితి ఉండేది.

**భారాస మంత్రులనూ విచారణకు పిలవాలి**

ఫోన్లు ట్యాప్ అయిన భారాస మంత్రుల జాబితా సిట్ వద్ద ఉంది. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లనూ ట్యాప్ చేశారు. వాళ్లందరినీ విచారణకు పిలవాలని సిట్‌కు చెప్పా. ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు చేసిన పనుల గురించి సిట్ అధికారులు చెబుతుంటే సిగ్గనిపించింది. క్షణక్షణం బాధ అనుభవించేలా వాళ్లకి శిక్ష విధించాలి. ఫోన్‌ట్యాపింగ్‌తో వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా కేటీఆర్ రూ.కోట్లు తీసుకున్నారు. ఒక కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి చెందిన రూ.7 కోట్లు పట్టుకున్నారు. ఇలా జప్తు చేసిన

వివరాలు 2లో..

ఆధునిక సాంకేతికతతో

# ఎస్సెల్బీసీ పునరుద్ధరణ

- త్వరలో ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



పైకప్పు కూలిన ఘటనతో అర్ధాంతరంగా నిలిచిపోయిన శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్సెల్బీసీ) సొరంగం పనులను ఆధునిక సాంకేతికతతో పునరుద్ధరించనున్నట్లు

వివరాలు 2లో..

# నెల రోజుల్లో కొత్త రైల్వేజోన్ నోటిఫికేషన్



- డిసెంబరు లేదా సంక్రాంతికి అపాయింటెడ్ డే?
- ద.మ.రైల్వే పునర్విభజన, ద.కోస్తా జోన్ ఏర్పాటు వేగవంతం
- కొత్త జోన్‌కి పీహెచ్‌ఓడీల నియామకం షురూ

దక్షిణ మధ్య రైల్వే పునర్విభజన.. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమయింది. కొత్త జోన్‌కు జూన్‌లో జీఎంగా సందీప్ మాథుర్‌ను నియమించిన రైల్వేబోర్డు ఇప్పుడు విభాగాధిపతు

వివరాలు 2లో..

# మైక్రోసాఫ్ట్‌ను ఓపెన్‌ఏఐ మింగేస్తుంది...

## సత్య నాదెళ్లకు మస్క్ హెచ్చరిక

- అందరికీ ఉచితంగా అందుబాటులోకి వచ్చిన జీపీటీ-5
- మైక్రోసాఫ్ట్‌ను ఓపెన్‌ఏఐ మింగేస్తుందంటూ ఎలాన్ మస్క్ వ్యాఖ్య
- మస్క్ హెచ్చరికకు దీటుగా స్పందించిన సత్య నాదెళ్ల
- ఇది పీహెచ్‌డీ స్థాయి నిపుణుడి లాంటిదని చెప్పిన ఓపెన్‌ఏఐ సీఈఓ
- తమ ఉత్పత్తుల్లో జీపీటీ-5ను అనుసంధానించిన మైక్రోసాఫ్ట్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచంలో మరో పెను సంచలనం నమోదైంది. టెక్ దిగ్గజం ఓపెన్‌ఏఐ తన సరికొత్త, అత్యంత శక్తిమంతమైన ఏఐ మోడల్ ‘జీపీటీ-5’ను గురువారం ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. ఈ అత్యాధునిక టెక్నాలజీని వినియోగదారులందరికీ ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించడం టెక్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లను ఉద్దేశించి చేసిన ఒక వ్యాఖ్య ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓపెన్‌ఏఐ ప్రకటన వెలువడిన వెంటనే, ఎలాన్ మస్క్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, “ఓపెన్‌ఏఐ...

వివరాలు 2లో..

# సైబర్ నేరాల్లో తెలంగాణకు పదో స్థానం

## ప్రభుత్వ చర్యలతో తగ్గుతున్న మోసాలు

## మొదటి మూడు స్థానాల్లో మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక



సైబర్ నేరాల్లో తెలంగాణ రాష్ట్రం పదో స్థానంలో నిలిచింది. గత ఏడాది కంటే ఈ ఏడాది పరిస్థితి కాస్త మెరుగైంది. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటకలు ఈ ఏడాది కూడా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇండియన్ సైబర్‌క్రైం కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు దేశంలో నమోదైన సైబర్‌నేరాల జాబితాను విడుదల చేసింది. మిగతా రాష్ట్రాల్లో సైబర్ నేరాలు పెరుగుతుండగా తెలంగాణలో కాస్త తగ్గుముఖం పట్టడం గమనార్హం. గత ఏడాది(జనవరి నుంచి డిసెంబరు) మహారాష్ట్ర 3,03,173 నేరాలతో మొదటిస్థానంలో నిలిచింది.

వివరాలు 2లో..

# వైసీపీకి పులివెందులలో ఓటమి భయం పట్టుకుంది

- వైసీపీ నేతలపై మంత్రి సవిత ఫైర్
- డైవర్షన్ పాలిటిక్స్ తో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శ
- వైసీపీ దాడుల వల్లే సునీత పులివెందులకు రాలేకపోతున్నారని వ్యాఖ్య
- దాడులు చేసి ఆ నిందను టీడీపీపై మోపుతున్నారని ఆరోపణ
- సూపర్ సిక్స్ పథకాలతో పులివెందులలో టీడీపీ గెలుపు ఖాయమని ధీమా

పులివెందులలో వైసీపీ నాయకులు ఓటమి భయంతో డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని రాష్ట్ర మంత్రి సవిత తీవ్రస్థాయిలో ఆరోపించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో ఓడిపోతామనే ఆందోళనతోనే

వివరాలు 2లో..



# ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు

## బండి సంజయ్ పై కేటీఆర్ ఫైర్



- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై బండి సంజయ్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్
- లేకపోతే పరువునష్టం దావా వేస్తానని తీవ్ర హెచ్చరిక
- త్వరలోనే లీగల్ నోటీసులు పంపుతామని వెల్లడి
- బండికి కనీస పరిజ్ఞానం కూడా లేదంటూ ఘాటు విమర్శలు

వివరాలు 2లో..

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపై చేసిన ఆరోపణలను 48 గంటల్లోగా వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ట్రోఫీ ఆవిష్కరణ

- విశాఖలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ %-% 4 ట్రోఫీ ఆవిష్కరణ
- ట్రోఫీని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి కె రామ్మోహన్ నాయుడు
- కార్యక్రమంలో పాల్గొన్న విక్టరీ వెంకటేశ్ తదితరులు ప్రముఖులు

వివరాలు 2లో..



# మూసీ పునరుజ్జీవమే వరదకు పరిష్కారం

- మొదటి పేజీ తరువాయి

కురిసిన భారీ వర్షం, తలెత్తిన ఇబ్బందులు, అధిగమించేందుకు అనుసరించాల్సిన తక్షణ చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. వరద ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే.. నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందని అధికారులు అభిప్రాయపడ్డారు.

**అన్ని వ్యవస్థలనూ ఆధునికీకరించాలి**

"హైదరాబాద్‌లో ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదు. ఒక్కోసారి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జూన్ నుంచి ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణంతో పోలిస్తే 16 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైంది. వాతావరణ మార్పులే ఇందుకు ప్రధాన కారణం. భారీ వర్షాలతో తలెత్తే విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు.. విపత్తుల నివారణ, నిర్వహణ ప్రణాళికను సమర్థంగా అనుసరించాలి.

**మూసీలోకి శుద్ధి చేసిన నీరు..**

డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసి.. మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహం ఉండేలా శాశ్వత ప్రణాళికలు ఉండాలి. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుంది. వందేళ్ల పాటు మహానగరంలో వరద సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే.. మూసీ పునరుజ్జీవమే ముఖ్యం. ఈ ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలి. ఆ దిశగా పనులు చేపట్టాలి.

**మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ముఖ్యంగా పాతనగరంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు పెడెస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేసి.. పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలి. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి" అని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్, పురపాలక శాఖ కార్యదర్శి ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**55 కి.మీ. పొడవునా మూసీ పునరుద్ధరణ**

హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరీవాహక ప్రాంతంతో పాటు.. నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలు సురక్షితంగా ఉంటాయి.

లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురికావు. నీటి ప్రవాహానికి ఎక్కడా అడ్డంకులు ఉండకూడదు. అవుటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లోని వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నగరంలోని అన్ని వైపుల నుంచి వర్షపు నీరు మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. హుస్సేన్‌సాగర్, దుర్గం, మీరాలం.. ఇలా అన్ని చెరువులు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలి. చెరువుల పునరుద్ధరణ, నాలాల వెడల్పు ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తవ్వాలి.

# నెల రోజుల్లో కొత్త రైల్వేజోన్ నోటిఫికేషన్

- మొదటి పేజీ తరువాయి

(పీహెచ్‌ఓడీ)ల నియామకంపై దృష్టి సారించింది. ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (పీసీఈఈ)గా ఏపీ శర్మను బుధవారం నియమించింది. కొద్దిరోజుల క్రితం ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ (పీసీఎంఈ)గా అమిత్‌గుప్తాకు పోస్టింగ్ ఇచ్చింది. ఫైనాన్స్ విభాగ అధిపతిగా తూర్పుకోస్తా జోన్‌లో పనిచేస్తున్న ఓ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇలా వరుస నియామకాలు చేస్తోంది. మిగతా విభాగాలకు సైతం కొద్దిరోజుల్లోనే పీహెచ్‌ఓడీలను నియమించనున్నట్లు సమాచారం.

**నోటిఫికేషన్ వెలువడిన 3-4 నెలల్లో..**

పీహెచ్‌ఓడీల నియామకం పూర్తికాగానే ద.మ.రైల్వే పునర్విభజన, దక్షిణ కోస్తా కొత్తజోన్ ఏర్పాటుపై నోటిఫికేషన్ రానుంది. ఇది ఆగస్టు నెలాఖరులోగా లేదా సెప్టెంబరు తొలివారంలో వస్తుందని రైల్వే వర్గాల సమాచారం. నోటిఫికేషన్ వెలువడిన 3-4 నెలల్లో 'అపాయింటెడ్ డే'ను ప్రకటిస్తారని ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు. ఆ రోజు నుంచి ద.మ., ద.కోస్తా జోన్‌ల కార్యకలాపాలు వేర్వేరుగా జరుగుతాయి.

దక్షిణ కోస్తా అపాయింటెడ్ డే వచ్చే డిసెంబరులో లేదా జనవరిలో (సంక్రాంతికి) ఉండొచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆపరేషన్స్, కమర్షియల్, భద్రత, విజిలెన్స్, ఆర్పీఎఫ్, సివిల్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్స్, సిగ్నల్-టెలికాం, పర్సనల్, స్టోర్స్ విభాగాలకు పీహెచ్‌ఓడీలను నియమించాల్సి ఉంది.

**విభజన తర్వాత..**

ద.మ.రైల్వేలోని మూడు డివిజన్లతో పాటు.. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పుకోస్తా జోన్‌లో కొంతభాగంతో కలిపి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పడనుంది. ద.మ.రైల్వేలో 6 డివిజన్లు మూడుకు పరిమితమవుతాయి.

రాయచూర్-వాడి సెక్షన్ (108 కి.మీ.): ప్రస్తుతం గుంతకల్లు డివిజన్ పరిధిలో ఉంది. దీన్ని సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీచేస్తూ రైల్వేబోర్డు నిర్ణయం తీసుకుంది. కర్ణాటక నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైళ్లకు జోన్ ఇంటర్‌ఛేంజ్ పాయింట్లు రెండు నుంచి ఒకటికి తగ్గుతాయి. యడ్లాపూర్, యెమరాస్‌లోని థర్మల్ పాయింట్లకు బొగ్గురవాణా సులభం అవుతుంది.

విష్ణుపురం-పగిడిపల్లి, విష్ణుపురం-జాన్‌పహాడ్ (142 కి.మీ.): గుంటూరు డివిజన్‌లో ఉన్న ఈ సెక్షన్లు సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అవుతాయి. సింగరేణి ప్రాంతం నుంచి విష్ణుపురం వరకు బొగ్గు రవాణా నిరంతరాయంగా కొనసాగుతుంది.

కొండపల్లి-మోటుమర్రి (46 కి.మీ.): సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్‌కు బదిలీ అవుతుంది. కొండపల్లిలోని నార్ల తాతారావు పవర్‌ప్లాంట్‌కు సాఫీగా బొగ్గు రవాణా.

# ముగ్గురు తప్ప అందరూ బాధితులే

రూ.వందల కోట్లు ఏమయ్యాయి? రూ.20 కోట్లు దొరికాయని మొదట టీవీల్లో వార్తలొస్తాయి.. తర్వాత కేసీఆర్ లేదా కేటీఆర్ ఫోన్ చేస్తే అవి రూ.2 కోట్లు అవుతాయి. ఇలా ఆర్థిక లావాదేవీల్లో రూ.వందల కోట్లు చేతులు మారినా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈడీకి లేఖ ఎందుకు రాయడం లేదు?

**కమిషన్లతోనే సర్కారు కాలయాపన**

మాకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే అనుమానం. ఏడాదిన్నర గడిచినా కమిషన్లతోనే కాలయాపన చేస్తున్నారు. ఇప్పటివరకు కేసీఆర్ కుటుంబంలో ఒక్కరినైనా అరెస్ట్ చేశారా..? వారిద్దరూ ఒక్కటే. రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాప్ అయింది కదా ఆయన్ని విచారించే ధైర్యం సిట్ అధికారులకుందా? జడ్జిలను విచారించే అధికారం వీళ్లకు ఉంటుందా? అందుకే దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని అడుగుతున్నాం. అలా కాదంటే కాంగ్రెస్, భారాసల మధ్య అవగాహన కుదిరినట్లే.

**ఒక్కో స్కాంకు దిల్లీలో రేటు**

ఒక్కో స్కాంకు దిల్లీలో రేటు కుదురుతుంది. తొలుత ఫామ్‌హౌస్ కేసుకు దిల్లీలో మూటలు అందించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, బియ్యం కేసుల్లోనూ ఇలాగే అప్పగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిషన్లు దిల్లీ కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారాయి. ఇక్కడ విచారణ ప్రారంభం కాగానే.. భారాస నేతలు దిల్లీలో రూ.వందల కోట్ల మూటలు అప్పగిస్తున్నారు. తన ఫోన్ ట్యాప్ చేసిన కేసీఆర్‌కు.. రేవంత్‌రెడ్డి ఈ రోజు క్లీన్‌చిట్ ఇచ్చారంటేనే వారిద్దరి మధ్య ఉన్న అవగాహన ఏంటో అర్థం చేసుకోవచ్చు. కేసీఆర్ ఏది మాట్లాడమంటే రేవంత్‌రెడ్డి అదే మాట్లాడతారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయనని చెప్పే అధికారం ముఖ్యమంత్రికి ఎవరిచ్చారు? అలాంటప్పుడు ఈ కమిషన్లు, విచారణలెందుకు?" అని సంజయ్ ప్రశ్నించారు.

## వైసీపీకి పులివెందులలో ఓటమి భయం పట్టుకుంది

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తూ, ఆ నిందను టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆమె విమర్శించారు. పులివెందులలో నెలకొన్న పరిస్థితులపై మంత్రి సవిత మాట్లాడుతూ, "వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, బెదిరింపుల కారణంగా వైఎస్ వివేకానంద రెడ్డి జయంతి కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన కుమార్తె సునీత కూడా భయపడుతున్నారు. గత మూడు రోజులుగా జరుగుతున్న దాడుల వెనుక వైసీపీ నేతలే ఉన్నారు. వారే దాడులు చేయించి, దాన్ని టీడీపీకి అంటగట్టాలని చూస్తున్నారని సునీత ఆవేదన వ్యక్తం చేశారు" అని సవిత తెలిపారు. పులివెందులలో టీడీపీ గెలుపు ఖాయమని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. "గత ఏడాదిగా పులివెందులలో ప్రశాంత వాతావరణం నెలకొంది. మా సూపర్‌సిక్స్ పథకాలకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ సానుకూలతల నేపథ్యంలో ఇక్కడి రెండు స్థానాలనూ టీడీపీ కైవసం చేసుకుంటుంది. ఈ నిజాన్ని జీర్ణించుకోలేకే వైసీపీ నేతలు ధర్నాలు చేయడం, పోలీసులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు" అని ఆమె పేర్కొన్నారు. 'జగన్ రప్పా.. రప్పా' వంటి నినాదాలు, వైసీపీ నేతల అసభ్యకర వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, టీడీపీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్యబద్ధంగానే ఎన్నికలను ఎదుర్కొంటుందని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ట్రోఫీ ఆవిష్కరణ

- మొదటి పేజీ తరువాయి

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ %-% 4 (ఏపీఎల్ %-% 4) ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం విశాఖపట్నంలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సందడి చేశారు. విశాఖ ఏసీఏ %-% వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఏపీఎల్ %-% 4 ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని చిన్ని, శ్రీభరత్, ప్రముఖ నటుడు విక్టరీ వెంకటేశ్, భారత మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, ఏసీఏ సెక్రటరీ సానా సతీశ్ బాబు, ఏపీఎల్ గవర్నెన్స్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటి ప్రజ్ఞా జైస్వాల్ చేసిన నృత్య ప్రదర్శనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సీజన్‌లో 7 జట్లు 25 మ్యాచ్‌లు ఆడనున్నాయి.

## సైబర్ నేరాల్లో తెలంగాణకు పదో స్థానం

- మొదటి పేజీ తరువాయి

ఉత్తర్‌ప్రదేశ్ 3,01,057, కర్ణాటక 1,69,384, ఉత్తరాఖండ్ 1,67,892, తమిళనాడు 1,33,427, తెలంగాణ 1,23,447 సైబర్ కేసులతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది దేశంలో మొదటి ఆరు నెలల్లో రికార్డుస్థాయిలో 12,47,393 సైబర్ నేరాలు నమోదయ్యాయి. అంటే గంటకు దాదాపు 288 మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణలో సైబర్‌నేరాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నేరాల నియంత్రణలో భాగంగా నేరస్థులు ఎక్కడున్నా వెళ్లి పట్టుకోవడం, ఫిర్యాదు అందిన వెంటనే సదరు లావాదేవీని నిలిపివేయడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి చర్యలతో రాష్ట్రంలో క్రమంలో సైబర్‌మోసాలు తగ్గుతున్నాయి.

## ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు

- మొదటి పేజీ తరువాయి

లేని పక్షంలో బండి సంజయ్‌పై పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తానని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు. ఈ మేరకు త్వరలోనే ఆయనకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపనున్నట్లు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాజకీయ లబ్ధి కోసమే తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క ఆధారం ఉన్నా బయటపెట్టాలని సవాల్ విసిరారు. కేవలం తన ఢిల్లీ బాస్‌లను మెప్పించడం కోసమే బండి సంజయ్ ఇలాంటి వీధి డ్రామాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తీరుపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తికి ఇంటెలిజెన్స్ పనితీరుపై కనీస అవగాహన అటుంచి, సాధారణ పరిజ్ఞానం కూడా లేదు. ఆయన వ్యాఖ్యలు హద్దులు మీరుతున్నాయి" అని విమర్శించారు. "ఢిల్లీ బాస్‌ల చెప్పులు మోసినంత సులభం కాదు బాధ్యతాయుతమైన మంత్రి పదవిని నిర్వహించడం," అంటూ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ చేస్తున్న అసత్య ప్రచారాలు ఆయన స్థాయిని మరింత దిగజార్చుతున్నాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

## ఆధునిక సాంకేతికతతో ఎస్సెల్బీసీ పునరుద్ధరణ

- మొదటి పేజీ తరువాయి

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీనికోసం ప్రణాళికాబద్ధమైన కార్యాచరణను అనుసరించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. "ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకం. నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధులు సాధించేందుకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశం కానున్నాం. సొరంగం ప్రమాదం అనంతరం నియమించిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక, సూచనలతో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తున్నాం. శ్రీశైలం నుంచి గ్రావిటీ ద్వారా సాగునీటిని తీసుకునే సొరంగం పనుల్లో తొమ్మిది కిలోమీటర్ల పనులు నిలిచిపోయాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సాగు నీరు, తాగునీటిని ఇచ్చేందుకు ఈ ప్రాజెక్టు కీలకం. అందుకే ఈ ప్రాజెక్టు పూర్తికి జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్జీఆర్ఐ) నేతృత్వంలో ముందుకు వెళ్లనున్నాం. ఎస్సెల్బీసీ సొరంగం ఉన్న పర్వత ప్రాంతంలో హెలికాప్టర్‌తో ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే తప్పనిసరిగా మారింది. త్వరలో చేపడతాం. జీఎస్ఐ కూడా తోడ్పాటునందిస్తోంది" అని పేర్కొన్నారు.

**సమ్మక్క, సారక్క బ్యారేజీపై నివేదిక**

ములుగు జిల్లాలో గోదావరిపై నిర్మిస్తున్న సమ్మక్క, సారక్క బ్యారేజీతోపాటు ఏపీలో నిర్మిస్తున్న పోలవరం వెనుక జలాల ప్రభావంపై ఐఐటీ ఖరగ్‌పుర్ నివేదిక ప్రభుత్వానికి అందిందని మంత్రి తెలిపారు. "సమ్మక్క, సారక్క బ్యారేజీతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోటూర్, తార్లగూడ, గంగారం, కంబల్పేటలలో 10.9 చ.కి.మీ. భూ భాగంలో ముంపు ఉంటుందని తేలింది. బ్యారేజీని పూర్తి చేసేందుకు ఆ రాష్ట్రంతో సంప్రదిస్తున్నాం. ఈ ప్రాజెక్టుతో 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 2022లో పూర్తి కావాల్సి ఉన్నా పలు కారణాలతో ఆగిపోయింది" అని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టులు, డ్యాంల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఉపేక్షిస్తే చర్యలు తప్పవని తెలిపారు. సింగూరు డ్యాం పరిశీలించాలని అధికారులకు సూచించారు.

## మైక్రోసాఫ్ట్‌ను ఓపెన్‌ఏఐ మింగేస్తుంది...

- మొదటి పేజీ తరువాయి

మైక్రోసాఫ్ట్‌ను బతికుండగానే మింగేస్తుంది" అంటూ సత్య నాదెళ్లకు సూటి హెచ్చరిక జారీ చేశారు. ఏఐ రంగంలో ఓపెన్‌ఏఐకి మైక్రోసాఫ్ట్ ప్రధాన భాగస్వామిగా ఉన్న తరుణంలో మస్క్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**పీహెచ్‌డీ నిపుణుడితో సమానం: ఆల్ట్‌మన్**

జీపీటీ-5 విడుదలపై ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ, ఇది ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) దిశగా వేసిన అతిపెద్ద ముందడుగు అని అభివర్ణించారు. జీపీటీ-3ని ఒక హైస్కూల్ విద్యార్థితో, జీపీటీ-4ని కాలేజీ విద్యార్థితో పోల్చిన ఆయన, జీపీటీ-5 ఒక పీహెచ్‌డీ స్థాయి నిపుణుడితో సమానమని అన్నారు. దీని సామర్థ్యం చూసి తాను భయపడ్డానని, ఇది ఒకరకంగా 'మాన్‌హాటన్ ప్రాజెక్ట్' లాంటి క్షణమని వ్యాఖ్యానించారు. తాను పరిష్కరించలేకపోయిన ఒక క్లిష్టమైన సమస్యను జీపీటీ-5 సునాయాసంగా పరిష్కరించినప్పుడు, తాను పనికిరానివాడినని అనిపించిందని ఆల్ట్‌మన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**మస్క్‌కు నాదెళ్ల కౌంటర్**

ఎలాన్ మస్క్ హెచ్చరికపై మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల హుందాగా స్పందించారు. "గత 50 ఏళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇందులో ఉన్న అసలైన మజా అదే! ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకోవడం, భాగస్వామ్యాలు, పోటీ అన్నీ ఉంటాయి. మా అజూర్ ప్లాట్‌ఫామ్‌పై గ్రాక్ 4 కోసం ఎదురుచూస్తున్నాం, గ్రాక్ 5 కోసం కూడా ఆసక్తిగా ఉన్నాం" అని నాదెళ్ల బదులిచ్చారు. మైక్రోసాఫ్ట్ తన 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్, అజూర్ ఏఐ ఫౌండ్రీ వంటి అన్ని ప్రధాన ఉత్పత్తులలో జీపీటీ-5ను అనుసంధానించినట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, తన సొంత ఏఐ ప్లాట్‌ఫామ్ 'గ్రాక్'ను వెనకేసుకొచ్చిన మస్క్, ఇప్పటికీ 'గ్రాక్ 4 హెవీ' మోడలే అత్యంత శక్తిమంతమైనదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రముఖ ఏఐ కోడింగ్ ఎడిటర్ 'కర్సర్ ఏఐ' కూడా తమ ప్లాట్‌ఫామ్‌లో జీపీటీ-5ను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించింది. తాము పరీక్షించిన వాటిలో ఇదే అత్యంత తెలివైన కోడింగ్ మోడల్ అని తెలిపింది. జీపీటీ-5 ఉచితంగా అందుబాటులోకి రావడంతో ఏఐ రంగంలో పోటీ మరింత తీవ్రరూపం దాల్చింది.

## ప్రభుదేవ్ ను సన్మానించిన పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ





**సీకే న్యూస్ ఆగస్టు 8 శుక్రవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** రాష్ట్ర స్థాయి 1000 మీటర్స్ మిడ్ రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించిన, ప్రభుదేవ్ ను పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ఘనంగా సన్మానించారు.
ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన,ఎమ్మార్పిఎస్
ఉద్యమ కారుడు గంగారపు శ్రీనివాస్
ప్రశాంత దంపతుల కుమారుడు గంగారపు ప్రభుదేవ్,
10వ తరగతి సెయింట్ గాబ్రీయేల్ స్కూల్ ఫాతిమానగర్ నుండి తేదీ
04-08-2025 రోజుహన్మకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన,సౌత్ జోన్ తెలంగాణ స్టేట్ మీట్ లో అండర్ 16 విభాగంలో 1000 మీటర్స్ రిలే పరుగుపందెం లో ప్రభుదేవ్ తన టీమ్,రక్షణు, సందీప్,రోహిత్ మొదటి స్థానం సాధించారు, విషయం తెలుసుకున్న పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ,ఈనెల 7 న సాయంత్రం చింతగట్టులో జరిగిన సభలో ప్రభుదేవ్ ను పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ శాలువాతో ఘనంగా సన్మానించి, జరుగబోయే జాతీయ స్థాయి పరుగు పందెంలో కూడ ప్రథమ స్థానంలో గెలుపొందాలని ఆశీర్వదించారు.

# భద్రాచలం మొబైల్ కోర్టుకి రెగ్యులర్ మెజిస్ట్రేట్ ని నియమించండి.

**ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ భద్రాచలం యూనిట్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 08,** స్పెషల్ అసిస్టెంట్ ఏజెంట్ టూ ది గవర్నమెంట్ మరియు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, మొబైల్ కోర్టు, భద్రాచలం కోర్టు కి రెగ్యులర్ మేజిస్ట్రేట్ లేనందున తక్షణమే రెగ్యులర్ మేజిస్ట్రేట్ ని, సరిపడా సిబ్బందిని మరియు బడ్జెట్ ను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ని కలిసి వినతిపత్రం ద్వారా సమస్యలను తెలియజేసిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్( ఏఐఎల్యు)జిల్లా కమిటీ. స్పందించిన జిల్లా కలెక్టర్ రెగ్యులర్ మెజిస్ట్రేట్ని నియమించడం కోసం మరియు బడ్జెట్ కేటాయించడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షులు ఎం.వి ప్రసాద రావు, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్, భద్రాచలం యూనిట్ అధ్యక్షులు బండారు అరుణ్ చ%శీ%ద్, ప్రధాన కార్యదర్శి పాయం రవివర్మ మరియు కమిటీ సభ్యులు పేరాల వెంకటేశ్వర్లు,న్యాయవాదులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమల రావు, ఎంవి రమణ కోర్స కృష్ణార్జునరావు, కొత్తగూడెం కోర్టు కమిటీ అధ్యక్షులు తెల్లబోయిన రమేష్, సభ్యులు అరికెల రవికుమార్ మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

# సుజాతనగర్‌లో ట్రాఫిక్ బిగింపు.

- రోడ్డుకు ఇరువైపులా షాపులు, వాహనాల రద్దీతో ప్రజలకు ఇబ్బందులు.
- వీడియో తీస్తున్న రిపోర్టర్‌పై బెల్ట్ షాప్ యజమానీ వాగ్వాదం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 08,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం లోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా వరుసగా ఏర్పాటైన షాపులు, వాటి ముందు నిలిపిన వాహనాలు రాకపోకలకు పెద్ద ఆటంకం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పీక్స్ అవర్స్‌లో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడం సాధారణమైపోయింది.
రిపోర్టర్ పరిశీలనలో ఉద్రిక్తత సమస్య పై స్థానిక మీడియా ప్రతినిధి ప్రత్యక్షంగా పరిశీలన జరిపి వీడియో తీస్తుండగా, అక్కడ ఉన్న బెల్ట్ షాప్ యజమాని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. "వీడియో తీయొద్దు" అంటూ వాగ్వాదానికి దిగారు. రిపోర్టర్‌కు అడ్డుపడుతూ చిత్రీకరణ ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

**వ్యాపారుల వాదన**
తమ షాపుల ముందు వాహనాలు ఆపడం కస్టమర్ల సౌకర్యం కోసం మాత్రమేనని కొంతమంది వ్యాపారులు చెప్పారు. "ప్రభుత్వం పార్కింగ్ సౌకర్యం కల్పిస్తే మేము సహకరిస్తాం" అని కొందరు పేర్కొన్నారు. అయితే మరికొందరు "ఇది సంవత్సరాలుగా అలానే ఉంది, ఇప్పుడు కొత్తగా సమస్య చేయడం ఎందుకు?" అంటూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారు.

**ప్రజల ఆవేదన**
స్థానికులు మాత్రం ట్రాఫిక్ ఇబ్బందులు తీరాలంటే రహదారిపై ఆక్రమణలు తొలగించాలని, వాహనాలు నిలిపే విధానాన్ని కట్టుదిట్టంగా నియంత్రించాలని, ట్రాఫిక్ పోలీసులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఈ సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారా లేదా అనేది చూడాలి.

## తల్లాడ మండల ప్రజలందరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు





**అన్నారుగూడెం మాజీ వీడిసి చైర్మన్ మల్లికార్జునరావు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తుమ్మలపల్లి రమేష్, సొసైటీ డైరెక్టర్ గోవింద్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్**

**తల్లాడ ఆగష్టు 8 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
తల్లాడ : రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నారుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్రంలోని ప్రతి ఒక్క అక్కా, చెల్లెలికి హృదయపూర్వక రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ రాఖీ పండుగ అనేది అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని,కుటుంబ విలువలను గుర్తుచేసే పండుగ అని పేర్కొన్నారు.ఇవాళ ఉన్న సామాజిక పరిస్థితుల్లో పురుషులంతా మహిళల పట్ల మరింత గౌరవ భావనతో మెలగాలని సూచించారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, వారికి సమాన అవకాశాలు కల్పించాలన్నారు.మహిళలకు రాజకీయ, వ్యాపార వాణిజ్య అవకాశాల్లో స్థానం కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర సత్తుపల్లి నియోజకవర్గం శాసన సభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ తన పరిపాలనలో మహిళలకు ప్రాధాన్యతను ఇచ్చి రాష్ట్ర స్థాయిలో మహిళల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలను ప్రారంభించారన్నారు.మహిళల ఆరోగ్య, ఆర్థిక, సామాజిక భద్రత కోసం అనేక పథకాలను అమలు చేశారని, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ వంటి పథకాలతో పేద కుటుంబాల యువతుల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందించారన్నారు.మహిళల కష్టాన్ని తగ్గించారని, , ఆరోగ్యలక్ష్మి వంటి పథకాలతో గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడారన్నారు. మహిళల సాంస్కృతిక విలువలను ప్రోత్సహించటంతో పాటు, మహిళల రక్షణకు షీ టీమ్స్, మహిళా భద్రత విభాగాలను ఏర్పాటు చేశారన్నారు. ఇదే సమయంలో, ఆసరా పెన్షన్ పథకం ద్వారా వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, బీడి కార్మికులుగా పని చేసే మహిళలకు నెల నెలా పెన్షన్‌లు అందించారని అన్నారుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.





# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -08:** కలెక్టరేట్ ఆవరణలోని ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు.

నెలవారి తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసి, గోడౌన్ రూం సీల్ ను పరిశీలించి, గోడౌన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని ఆర్.అండ్ బి. అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా, గోడలలో నీరు ఇంకకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.
అనంతరం సీసీ కెమెరాల పని తీరును పరిశీలించి తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేసి భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా చేస్తున్న డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.
జిల్లా కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఏం. ఏ. రాజు, డిటి అన్సారీ, ఆర్ అండ్ బి ఏఈఈ లలిత, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## పసుపులేటి నాగరాజు పార్దేవదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించిన రేగళ్ల



**తల్లాడ ఆగష్టు 7 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** తల్లాడ మల్లవరం గ్రామం పసుపులేటి నాగరాజు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేగళ్ల ఎర్ర శ్రీనివాసరావు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు పాగాడ సానుభూతి తెలియజేశారు పార్థివ దేహాన్ని సందర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండలం అధ్యక్షులు భూక్య అంజి,టిడిపి నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు, స్నేహితుడికి ఘన నివాళులు అర్పించారు ,

## ఆగస్టు 12న జాబ్ మేళా నిర్వహణ .... జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**అపోలో హెూమ్ కేర్ లో ఉద్యోగాలకై జాబ్ మేళా నిర్వహణ**

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -08 :**
జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు అపోలో హెూమ్ కేర్ లో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 12న మంగళవారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
అపోలో హెూమ్ కేర్ లో హెూమ్ కేర్ నర్సులు (30) ఖాళీలకు గాను జిడిఏ., ఎంపిహెచ్ డబ్ల్యూ., డిపిహెచ్ఎంఏ., జిఎన్ఎం. అర్హత గల వారు, నర్సింగ్ సూపర్వైజర్ (2) ఖాళీలకు గాను జిఎన్ఎం., పీబిఎస్సి., బీఎస్సీ/ఎంఎస్సీ నర్సింగ్ అర్హత గల వారు, బయో మెడికల్ ఎగ్జిక్యూటివ్ (2) ఖాళీలకు గాను బీటెక్ బయో మెడికల్ అర్హత గల 18 నుండి 30 సంవత్సరాల యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని, ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మంలో ఉన్నాయని, ఎంపికైన వారికి వేతనం 25 వేల నుండి 42 వేల వరకు ఉంటుందని తెలిపారు.
మొత్తం 34 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో తెలిపారు.

## పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించిన ముదిరాజ్ లు

**శ్రీరంగాపూర్: సికె న్యూస్ ప్రతినిధి** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఘనంగా జయంతి ఉత్సాహాలు ఘనంగా జరిగాయి అదేవిధంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించడం ఇట్టి కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల ముదిరాజులు బడుగు బలహీన వర్గాలకు బానిసత్వం నుండి పెత్తందారి వ్యవస్థ నుండి విముక్తి చేయడానికి ప్రజలందరూ స్వేచ్ఛ సమానత్వం మహిళాశాంతి కర్త రైతు సంక్షేమ కోసం కులాల మతాల మధ్య ఐక్యత కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంటూ మాట్లాడారు ప్రజా వీరుడు పండుగ సాయన్న జన్మదిన శుభాకాంక్షలు ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మత్యకారులు పాల్గొనడం జరిగింది

# క్రీడా పాఠశాలలు పతకాలు సాధించే కర్మగారాలుగా మారాలి

**విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ – ప్రతి మూడు నెలలకోసారి విద్యార్థి ఫలితాలపై సమీక్ష**

**స్పోర్ట్స్ స్కూళ్ళు, అకాడమీ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు**

**క్రీడలపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి వాకిటి శ్రీహరి**



**సి కె న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, అకాడమీలు పతకాలు సాధించే కర్మగారాలుగా మారాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు.

ఎల్బీ స్టేడియంలో చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసి ఆయనరాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లు, అకాడమీల పనితీరు, సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ,2025–26 విద్యా సంవత్సరానికి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరగాలనిహకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు కరీంనగర్, ఆదిలాబాద్ స్కూళ్లలో ఆధునిక క్రీడా శిక్షణ, విద్యలో మెరుగుదల సాధించాలని అధికారులకు సూచించారు.హకీంపేట్‌లో తక్షణ మరమ్మతులు, అన్ని స్కూళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

స్పోర్ట్స్ అథారిటీ అకాడమీల పనితీరు మెరుగుపరిచి విద్యార్థి క్రీడాకారుల్లో స్ఫూర్తిని కలిగించే కార్యక్రమం నిర్వహించాలని కోరారు

స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో త్రైమాసికంగా బ్యాటరీ టెస్టులు నిర్వహించి , కంప్యూటరైజ్డ్ రిపోర్టులు తయారుచేసి విద్యార్థుల తల్లిదండ్రులకు పంపించే విధంగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు.

ప్రతిభ ఆధారంగా విద్యార్థుల వర్గీకరణ (%టా–ఖీ%) చేసి క్రీడా ప్రతిభ లేని వారిని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లకు బదిలీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

స్పోర్ట్స్ స్కూల్లో పనిచేసే అధికారులు సిబ్బంది కోర్సులు అందరూ విద్యార్థుల సంక్షేమం కోసం తమ పిల్లలుగా చూసుకోవాలని వారికి ఇబ్బందులు రాకుండా వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు.

ప్రేరణాత్మక తరగతులు, వ్యక్తిత్వ వికాస అంశాల్లో శిక్షణ యోగ శిక్షణ తప్పనిసరి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

తెలంగాణ విద్యార్థిని విద్యార్థులు సాధించిన విజయాలను ప్రదర్శించేందుకు ప్రతి స్పోర్ట్స్ స్కూల్ అకాడమీల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కొరకు విజిటర్స్ హాల్స్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

ఎల్.బి. స్టేడియంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం చేసి అన్ని అకాడమీలను స్పోర్ట్స్ స్కూల్ లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను ఈ కాన్ఫరెన్స్ వాళ్లకు అనుసందించాలని తెలిపారు.

క్రమం తప్పకుండా క్రీడా శాఖలోని అన్ని విభాగాలపై నిరంతరం సమీక్షలు చేస్తామని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీల పనితీరు మెరుగుపరచడమే కాకుండా అన్ని అంశాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు అందరి అభిప్రాయాలు తీసుకుంటూ సమగ్ర క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు.

విధుల్లో అలసత్వం వహించే ఎవరిని కూడా ఉపేక్షించమని మంత్రి శ్రీహరి తెలిపారు

ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి, తో పాటు హకింపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి టి. మమత, డిప్యూటీ డైరెక్టర్లు జి చంద్ర రెడ్డి జి. రవీందర్, డా. రవి శంకర్ పల్లెల, , ఎస్.ఎం. బాషా, జి. అశోక్ కుమార్, పి. సందీప్ కుమార్, సురేష్ కాలేరు తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలి....



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- జిల్లా ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- ఖమ్మం జిల్లా ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -08:** ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సుడా క్రింద జిల్లా ఆసుపత్రిలో 13 అభివృద్ధి పనులు 25 కోట్ల రూపాయలతో చేపట్టామని అన్నారు. 23 కోట్ల 75 లక్షలతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

తక్కువ ఖర్చుతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడే యంత్రాల కొనుగోలు, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని, అవసరమైన నిధులను తప్పనిసరిగా మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం ఆసుపత్రి నందు పేషెంట్లకు ఉపయోగపడే విధంగా టాయిలెట్స్ మరమ్మత్తు పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు.

జిల్లా ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో అందుబాటులో ఉన్న యంత్రాలు, వాటి ప్రస్తుత స్థితి గతులపై రిపోర్ట్ తయారు చేయాలని, మరమ్మత్తుకు గురైన యంత్రాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన ఇన్ ఫ్రా సౌకర్యాలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని అన్నారు.

ప్రజలలో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించేందుకు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా కీలకమని, మన ఆసుపత్రికి కార్పొరేట్ లుక్ తీసుకుని రావాలని అన్నారు. ఆసుపత్రి అంతర్గతంగా సిసి రోడ్ల నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని, డి.ఎం.ఎఫ్.టి. లేదా ఇతర నిధుల నుంచి మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎం. నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధికై పోరాడుతాం



**సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**

**సికె న్యూస్ ప్రతినిధి:** ఈరోజు అడ్డగూడూరు మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ నాలుగవ జిల్లా మహాసభలలో నూతన జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన యానాల దామోదర్ రెడ్డి సహాయ కార్యదర్శిలుగా ఎన్నికైన బోలగాని సత్యనారాయణ చేడే చంద్రయ్య గార్లకు సన్మాన కార్యక్రమం మండల కార్యదర్శి రేకల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది మండల కౌన్సిల్ వివిధ గ్రామ శాఖల కార్యదర్శుల ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించడం జరిగింది.

అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి గారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో అడ్డగూడూర్ చివరి మండలం కావడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది నియోజకవర్గం తుంగతుర్తి సూర్యాపేట జిల్లాలో ఉంది

ఈ ప్రాంతం నుండి గతంలో అనేకమంది ఎమ్మెల్యేలుగా మంత్రులుగా ప్రాతినిధ్యం వహించిన అభివృద్ధి మాత్రం శూన్యం గత ప్రభుత్వం ఇక్కడికి మాండలిక వ్యవస్థ తీసుకొచ్చిన అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తున్నాయి ఇక్కడి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు లేక సరిపడా అధికారులు లేక ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు

ఈ ప్రభుత్వం ఇప్పటికైనా అడ్డగూడూరు మండలానికి సొంత కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజల అవస్థలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధుల వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికై మండల సమగ్ర అభివృద్ధికై సిపిఐ జిల్లా సమితి పోరాడుతుందని ఆయన తెలిపారు.

ప్రధానంగా ఈ మండలానికి రావలసిన పునాది గాని కాలువ ను పూర్తి చేసి ధర్మారం వరకు నీటిని విడుదల చేయాలనే డిమాండ్ తో పోరాటం నిర్వహిస్తామని ఈ కాలువ ఇక్కడికి వచ్చినట్లయితే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

సహాయ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో బీసీ రిజర్వేషన్లు అనేవి చాలా ప్రాముఖ్యతను చాటుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బీసీలకు 42 శాతం నిర్ణయాన్ని బిజెపి అస్పష్టత కారణంగా రిజర్వేషన్లను తొక్కిపట్టాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది బీసీ రిజర్వేషన్ అయోమయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక గ్రామాలకు కేంద్రం నుండి రావాల్సిన నిధులు ఆగిపోయాయి అని వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిసి రిజర్వేషన్లను 42 శాతం పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు

మరొక సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య మాట్లాడుతూ అడ్డగూడూరు ప్రాంతంలో భూస్వాముల ఆగడాలని వ్యతిరేకిస్తూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో 600 ఎకరాల పెద్ద రేగడిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని ఆయన అన్నారు

మండలంలోని అన్ని గ్రామాలలో సిపిఐ ప్రజా సంఘాలు ఏర్పాటు చేసి పార్టీ శాఖలను బలోపేతం చేసుకోవాలని స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ పార్టీ అధిక స్థానాలను గెలుచుకోవాలని ఆయన అన్నారు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పక్క భవనాలు నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్ మండల కౌన్సిల్ సభ్యులు కందుకూరి వెంకన్న బొనుగసుదర్శన్ రెడ్డి బెల్లి శ్రీకాంత్ సోలిపురం నాగిరెడ్డి చెడే సుందరయ్య శీలం వెంకన్న తీగల సైదులు మార్త వీరయ్య ఉప్పుల శివ చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ

- దేవరకొండ నియోజకవర్గ సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు
- బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**సికె న్యూస్ ప్రతినిధి దేవరకొండ:** ప్రేమానురాగాలకు రాఖీ పౌర్ణమి ప్రతీక అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గ సోదర సోదరీమణులకు రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షా బంధన్ పండుగ సహోదరత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ అన్నాదమ్ముల్లకు అనురాగంతో చేతికి రక్షా బంధనాన్ని కట్టడం గొప్ప సందర్భం అని ఆయన తెలిపారు. రక్షాబంధన్ సాంప్రదాయం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని, ప్రజల్లో సహోదరత్వాన్ని మరింతగా పెంపొందిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రేమనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను నియోజకవర్గ ప్రజలంతా ఆనందోత్సాహల్లో జరుపుకోవాలని ఆయన కోరారు.

# లంబాడిజాతి డిమాండ్స్ ను విస్మరిస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై యుద్ధమే

**రాజేష్ నాయక్.నంగారా భేరి ఎల్ హెచ్ పి ఎస్.రాష్ట్ర అధ్యక్షులు**



**సికె న్యూస్ ప్రతినిధి**

లంబాడి హక్కుల పోరాట సమితి ( నంగరా భేరి) రాష్ట్ర వర్కింగ్ ప్రభాస్ రాథోడ్. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ గార్లు మాట్లాడుతూ ఈరోజు నంగారాభేరి చేస్తున్న ఈక్రింది డిమాండ్లపై తెలంగాణ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఆగష్టు 24, 2025 న ఛలో ఇందిరా పార్క్, హైదరాబాద్ వేదికగా ఉద్యమ కార్యాచరణ ఉంటుందని, ఇది ప్రభుత్వాలపై ప్రజాస్వామిక యుద్ధం ప్రకటిస్తున్నామని హెచ్చరించారు.

ప్రధాన డిమాండ్స్: 1. తండాల గ్రామపంచాయతీలను– రెవెన్యూ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలి, లితండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలి.

2. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన, కులగణనలో ఎస్ టి లంబాడి జనాభాను బహిర్గతం చెయ్యాలి.

3. ఎస్ టి లు సాగు చేస్తున్నా లావుణి, సీలింగ్,పోడు భూములకు శాశ్వతంగా పూర్తి హక్కులతో అసెంబ్లీ లో చట్టం చేసి పట్టాలు ఇవ్వాలి.

4. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ద్వారా ఎజెన్సీ ప్రాంతంలో 100 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చెయ్యాలి.

5. ఎస్ సి, ఎస్ టి టీ ప్రైడ్ ఇండస్ట్రియల్ అండ్ కామర్స్ అనే పథకం ద్వారా గిరిజన సోదరులకు వివిధ రకాల వాహనాల పై సబ్సిడీ ఇస్తామని చెప్పి, ఇప్పటివరకు సబ్సిడీ విడుదల చెయ్యలేదు, నిలిపి వేసిన సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చెయ్యాలి.

6. కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్యే, ఎంపీ ల స్థానాలు పెంచే పునర్విభజన లో రాష్ట్ర జనాభా యూనిట్ కాకుండా,జిల్లా జనాభా యూనిట్ ఆధారంగా ఎస్ టి లకు ఎమ్మెల్యే, ఎంపీ రిజర్వేషన్ సీట్లు కేటాయించాలి.

7. ఎస్ టి ల రిజర్వేషన్ ను, కేంద్ర ప్రభుత్వం 7.5 శాతం ను పెరిగిన జనాభా ఆధారంగా 14 శాతనికి పెంచాలి.


8. ఎస్ టి లంబాడి గోర్ బోలి బాషను అధికారికంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్ లో చేర్చాలి

9. బంజారా హిల్స్ లోని బంజారా భవన్ ను వెంటనే బంజారాల కార్యక్రమాలకు ఉచితంగా కేటాయించాలి.

ఈ కార్యక్రమలో అరుణ్ నాయక్.రవి నాయక్ శ్రీనివాస్ వినోద్ మోహన్ సుభాష్ శ్రీరామ్ రాజు నారాయణ రమేష్ విజయ్ గణేష్ లక్ష్మణ్ రాహుల్ గోర్ సేన నాయకులు బానోత్ రాజు జైపాల్ నందు కుషాల్ నాయక్. ప్రసాద్ నాయక్. తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణులకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్

- కూటమి ప్రభుత్వం కు రుణపడి ఉంటాం .
- చంద్రబాబు ,పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం.



**ఎమ్మిగనూరు టౌన్, సికె న్యూస్ ప్రతినిధి:ఆగస్టు 08,** రాష్ట్రంలో నాయి బ్రాహ్మణుల వ్యాపార దుకాణాలకు నెలకు 200 యూనిట్లు కరెంటును ఉచితంగా ఇవ్వడం హర్షణీయం అని ఎమ్మిగనూరు పట్టణ నాయి బ్రాహ్మణుల సంఘం ఇంచార్జి బాలు సంతోషం వ్యక్తం చేశారు.శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్ర పటాలకు నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ ఎన్నికల ముందు మా కష్టాలను తెలుసుకున్న చంద్రబాబు,లోకేశ్ ,పవన్ కళ్యాణ్ మాకు 200 యూనిట్లు కరెంటును ఉచితంగా ఇవ్వడం పట్ల కూటమి ప్రభుత్వం , చంద్రబాబు,పవన్ కళ్యాణ్,లోకేష్ అలాగే ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి రుణపడి ఉంటామని అన్నారు.కార్యక్రమంలో నాయి బ్రాహ్మణుల సంఘం నాయకులు శ్రీనివాసులు, జిల్లా సాధికారిక కమిటీ సభ్యులు పోనకలదిన్నె రాజన్న,ఒలంపిక్ గోవిందు,అధ్యక్షుడు నరసయ్య,వెంకటేష్,కనకవీడు గోపాల్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి లో ఉన్న సమస్యలు పరిష్కరించాలి.



**దేవనకొండ సి కే న్యూస్ ఆగస్టు 08** మండలంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రి నందు ల్యాబ్ టెక్నీషియన్ కొరత ఉంది అని బిజెపి మండల అధ్యక్షుడు కిరణ్ కర్నూలులో వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 44 గ్రామాలు ఉన్నాయని దాదాపుగా 90000 మంది జనాభా ఉన్నారని అత్యవసరంగా హాస్పిటల్కు వచ్చిన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్న చాలా ఇబ్బందులుగా ఉందని ఇక్కడ ఇన్చార్జి ల్యాబ్ టెక్నీషియన్ ఉండడంవల్ల చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయని దయచేసి మండలానికి ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. ఈ విషయంపై ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందిస్తూ త్వరలోనే ప్రభుత్వ ఆసుపత్రి నందు ల్యాబ్ టెక్నీషియన్ ను నియమిస్తామని తెలిపారని వెల్లడించారు.

# నూకాలమ్మ అమ్మ వారు స్వర్ణ వర్ణ పూర్ణ కవచాలంకరణలో శుక్రవారం సందర్భంగా నిత్య పూజలు.

**జంగారెడ్డిగూడెం సి కే న్యూస్ ఆగస్టు 8** :జంగారెడ్డిగూడెం పట్టణంలో నాల్గవ శ్రావణ శుక్రవారం వివిధ రకాల పండ్ల అలంకరణలో అమ్మ వారి దివ్య దర్శనం



జంగారెడ్డిగూడెం పట్టణానికి ఉత్తరాన కొలువైన నూకాలమ్మ అమ్మవారు స్వర్ణ వర్ణ పూర్ణ కవచాలంకరణలో దర్శనమిచ్చారు.శుక్రవారం సందర్భంగా విశేష పూజలు, ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలు సాయం సంధ్యాహరతి పూజలు అర్చక స్వాములు నిర్వహించారు.

ఆలయ శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ, పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు స్నేహితులు మేకా సింహాద్రి తదితరులు అమ్మ వారిని ప్రత్యేక దర్శనం చేసుకుని ఆలయ కమిటీ వారికి అభినందనలు తెలియజేశారు, అని అన్నారు.

అమ్మ వారి రజిత వస్త్ర తయారీకి మంత్రపూడి శ్రీనివాసరావు, రేవతి దంపతులు 5తులాల వెండిని చీకట్ల రమేష్ సాయిదివ్య దంపతులు 5 తులాల వెండిని సమర్పించారని, వారిని వారి కుటుంబ సభ్యులను అమ్మ వారు ఎల్లవేళల కాచి కాపాడాలని అన్నారు.

ఆగస్టు నెల 15వ తేదీన అనగా నాల్గవ శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని అమ్మ వారు వివిధ రకాల పండ్ల అలంకరణలో దర్శనమిస్తారని,భక్తులు అలంకారాల నిమిత్తం వస్తు రూపంలో మరియు ధన రూపంలోనూ, సేవ రూపంలోనూ తమ సహాయ సహకారాలు అందించాలని ఆహ్వానం పలికారు.

చిట్లూరి సుబ్బరావు నేతృత్వంలో
శ్రీ నూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం ప్రసాద వితరణ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రొంగల నాగేశ్వరరావు,పోలుపర్తి రాము,గాలి నూకరాజు, చిట్లూరి సర్వేశ్వరరావు,చింతకాయల అచ్చిరాజు తదితరులు మరియు మహిళా కమిటీ సభ్యులు మరియు గ్రామ భక్త మహా జనులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# మాంటిసోరి లో రక్షా బంధన్ వేడుకలు



**నర్సంపేట : సి కే న్యూస్** నర్సంపేట పట్టణంలో మాంటిసోరి స్కూల్ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకలలో విద్యార్థిని విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖి కట్టుకొని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్కూల్ ప్రిన్సిపల్ ఎర్ర జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రాఖీ అంటే రక్షణ అని"బందన్ " అంటే బంధం అని అన్న చెల్లెలు అనుబంధనికి అక్క తమ్ముడి అనుబంధానికి ఈ పండుగ నిదర్శనం అని వెలకట్టలేని బంధాలను వదులుకోలేని అనుబంధాలను గుర్తుచేసే మధురమైన రక్షబంధన్ అని పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'సామూహిక వరలక్ష్మీ వ్రతాలు'

**సంగారెడ్డి జిల్లా, బ్యూరో చీఫ్, సి కే న్యూస్**
ఎస్.ఎస్.కె సమాజ్ (సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్) భవనము నందు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నాడు సంగారెడ్డి లో పాత బస్సు స్టాండ్ దెగ్గర వున్నా ఎస్ ఎస్ కె (పట్కారీ) భవన్లో 'సామూహిక వరలక్ష్మి వ్రతాలూ' నిర్వహణ తో ఒక్కసారిగా చుట్టూ ప్రక్క పరిసరాలన్నీ ఆధ్యాత్మిక వార్తవరణం తో వెల్లివిరిసాయి. ఈ సందర్భంగా ఎస్.ఎస్.కె సమాజ్ పెద్దలు 'వరలక్ష్మి వ్రతం' యొక్క విశిష్టత తెలియచేస్తూ..., హిందూ ధర్మ జీవన విధానంలో ఇది ఒక ముఖ్యమైన పండుగ, ముఖ్యంగా స్త్రీలు ఆచరించే ఒక నోము అని అన్నారు. ఈ వ్రతం లక్ష్మీదేవిని పూజించడానికి అంకితం చేయబడింది, ఆమెను వరాలనిచ్చే దేవతగా భావిస్తారు, సామూహిక వరలక్ష్మి వ్రతం అనేది ఒకే చోట ఎక్కువ మంది స్త్రీలు కలిసి వరలక్ష్మి దేవిని పూజించే ఒక కార్యక్రమం. ఇది సామాజిక సంబంధాలను బలోపేతం చేస్తుంది, భక్తి భావాన్ని పెంచుతుంది మరియు సమాజంలో ఐక్యతను ప్రోత్సహిస్తుంది అని అన్నారు. భక్తి, ఆధ్యాత్మికత: సామూహిక వరలక్ష్మి వ్రతం భక్తి భావాన్ని పెంపొందించడానికి మరియు దైవత్వంతో అనుసంధానం చేయడానికి ఒక గొప్ప మార్గం. సామాజిక ఐక్యత: ఈ వ్రతం ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి, ఒకరికొకరు సహకరించుకోవడానికి ఒక వేదికను అందిస్తుంది. సమాజంలో బంధాలు





బలపడతాయి: సామూహిక పూజలు మరియు ఇతర కార్యక్రమాల ద్వారా, మహిళల మధ్య సామాజిక సంబంధాలు బలపడతాయి. ఆర్థికాభివృద్ధి: వరలక్ష్మి వ్రతం, సంపద మరియు శ్రేయస్సు కోసం జరుపుకునే వ్రతం. సామూహికంగా పూజించడం ద్వారా, ప్రజలు ఆర్థికాభివృద్ధిని కోరుకుంటారు. సంస్కృతిని కాపాడుకోవడం: సామూహిక వరలక్ష్మి వ్రతం మన సంస్కృతిని మరియు సాంప్రదాయాలను కాపాడుకోవడానికి ఒక గొప్ప మార్గం. ధార్మిక కార్యక్రమాలకు మద్దతు: ఈ వ్రతం ద్వారా సేకరించిన నిధులను ధార్మిక కార్యక్రమాలకు, సమాజ సేవకు వినియోగిస్తారు. సంతోషం మరియు శ్రేయస్సు: సామూహికంగా పూజలు చేయడం వలన, ప్రజలు సంతోషంగా మరియు శ్రేయస్సుతో ఉంటారు. సహాయం మరియు మద్దతు: సామూహిక వరలక్ష్మి వ్రతం ద్వారా, ప్రజలు ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి మరియు మద్దతు ఇచ్చుకోవడానికి ఒక అవకాశం లభిస్తుంది అంటూ పలు విషయాలను, సామూహిక వరలక్ష్మి వ్రతం యొక్క ప్రాముఖ్యత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.కె సమాజ్ పెద్దలు (సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్) ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# అనవసర విషయాలలో రాళ్ళు వేస్తే మటుకు సహించేది....



- ఇది నీకు రెండవసారి హెచ్చరిక, టీడీపీ అంతర్గత విషయాలలో...
- వేలు పెడితే చాలా ఇబ్బంది పడతారు...
- సూక్ష్మ పరిశ్రమలకు, టెక్స్ టైల్ పార్క్ కు తేడా తెలుసా..
- నీవు ఎలా అమ్ముడు పోయి, ఏమిటీకి కక్కుర్తి పడ్డావో...
- టీడీపీ నాయకుల మండిపాటు.

**ఎమ్మిగనూరు టౌన్, సి కే న్యూస్ ఆగస్టు 08,** సూక్ష్మ సూక్ష్మ పరిశ్రమలకు, టెక్స్ టైల్ పార్క్ కు తేడా తెలుసా మల్లికార్జున అని టీడీపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయం నందు ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు దామ నరసింహులు, ఎంబీ మహేష్, మిన్నప్ప, స్వాతి, విజయలక్ష్మి,బుడగజంగాల నరసింహులు, బండ నరసప్ప మాట్లాడుతూ రాష్ట్రానికి ఆరు టెక్స్ టైల్స్ పార్కులు వస్తే ముందుగా బనవాసి దగ్గర ఏర్పాటు చేస్తున్నారని,విషయం తెలిసి కేవలం తెలుగుదేశం పార్టీ ని చులకన చేయాలనే ఉద్దేశ్యం తో మాట్లాడుతున్న మాట చేనేత మల్లికార్జున అనే వాడు మాట్లాడాడని, మధుబాబు చేనేత దినోత్సవం నాడు నీవు ఎలా అమ్ముడు పోయి, ఏమిటీకి కక్కుర్తి పడ్డావో టీడీపీ నుండి బయటకు పోయిన తరువాత అక్కడ గౌరవంగా ఉండాలని,కానీ అనవసర విషయాలలో రాళ్ళు వేస్తే మటుకు సహించేది లేదని, ఇది నీకు రెండవసారి హెచ్చరిక అని తీవ్రంగా మండిపడ్డారు.టీడీపీ అంతర్గత విషయాలలో వేలు పెడితే చాలా ఇబ్బంది పడతారని, ఇద్దరు ఎమ్మెల్యే లు, ముగ్గురు ఎమ్మెల్యే లు అది నీకు అనవసర విషయం అని తీవ్రంగా మండిపడ్డారు.కేవలం నియోజకవర్గం నకు ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి ని చూడాలని, ఏవైనా అందులో లోపాలు ఉంటే సద్విమర్శ చేయాలని మా ఎమ్మెల్యే స్వీకరించి సమాధానం చెబుతారని హితవుపలికారు.ఎమ్మిగనూరు లో చేనేతలకు ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర రెడ్డి ఎల్లప్పుడూ తోడుగా ఉన్నారని,ఎవరు పనిచేసిన భార్య, పిల్లలు కొరకు పనిచేస్తారని,కాని ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర రెడ్డి మాత్రం ఎమ్మిగనూరు నియోజకవర్గం ప్రజలు కొరకు, చేనేతల కొరకు పని చేస్తున్నారన్న విషయాన్ని గుర్తు పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.చేనేతల ముసుగులో, చేనేతల కులం లో పుట్టి చేనేతలకు ద్రోహం చేసే విధంగా నిన్నటి రోజునటీడీపీ నుండి వైసీపీ లో చేరిన మల్లికార్జున, మధుబాబు మాట్లాడారని మండిపడ్డారు.చేనేతల ఉపాధి కొరకు ఏర్పాటు చేసేది టెక్స్ టైల్ పార్క్ అని,దాన్ని విమర్శిస్తూ అది కేవలం ఎం ఎస్ ఎం ఈ పార్క్ అని,అది 175 నియోజక వర్గాలలో ఉంటుందని,అది టెక్స్ టైల్ పార్క్ కాదని అన్నారు. అసలు విషయం మీకు తెలుసా అని,ఎం ఎస్ ఎం ఈ పార్క్ అనేది చులకన భావం తో మాట్లాడేది కాదని, భారతదేశం లో పరిశ్రమలను చూసేటటువంటి ఒక సంస్థ అని, దాని ద్వారా ఇక్కడ కావలసిన మౌళిక వసతుల ఏర్పాటు కు పెట్టుబడి దారికి మధ్యవర్తిత్వం వ్యవహారిస్తూ అన్ని మౌళిక వసతులు కల్పించిదే ఎం ఎస్ ఎం ఈ పార్క్ అనేది ఒక పెద్ద సంస్థ అని తెలిపారు.చేనేతలకు అన్యాయం చేసినటువంటి పార్టీ లో చేరి మళ్ళీ చేనేతలు గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

= వాల్ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్,గందె శ్రీనివాస్ గుప్తా

**నర్సంపేట: సి కే న్యూస్** వరంగల్ మహేశ్వరి గార్డెన్ లో 12వ తారీకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరగబోయే మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న. వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్,కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు జాబులు వచ్చే విధంగా 35 కంపెనీలు ముందుకు రావడం జరిగింది. 2000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా చూడాలని కంపెనీలను కోరడం జరిగిందన్నారు.దీనికిగాను అభ్యర్థులు గత మూడు రోజులుగా ఎన్రోల్ చేసుకుంటున్నారని వారు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ ఆర్యవైశ్య మహాసభ ప్రముఖులు రాష్ట్ర కార్యదర్శి వంగెటి అశోక్ కుమార్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రెటరీ గార్లపాటి శ్రీనివాస్, సెక్రెటరీ నాగేంద్రబాబు,దొడ్డ మోహన్ రావు, కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, రాజకీయ చైర్మన్ పొట్టి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు యాద రవీందర్, ఉపాధ్యక్షులు సదాశివుడు,
అల్లాడి బద్రి,రఘు,పూర్ణచందర్ పరమేశ్వర్ ,పాల మురళి ,అన్ని విభాగాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు...



**ఎల్బీనగర్, సి కే న్యూస్ జులై 08,** ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ, గణేష్ నగర్ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 1.88 కోట్లు మంజూరైనట్టు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధి కోసం ప్రతి ఒక్క అవకాశం వినియోగించుకుంటూ నిరంతర కృషి చేస్తున్నామని తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా బాధ్యత లు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.50 కోట్లు మంజూరయ్యేలా నిధులు సాధించామని, వాటితో పలు అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ప్రభుత్వ మార్పు అనంతరం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి ని కార్యాలయంలో కలిసి మౌలిక సదుపాయాల కల్పనకు మరిన్ని నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్ ఎల్బీనగర్ ఇన్చార్జి మధుయాష్కి గౌడ్ సహకారంతో మరిన్ని నిధులతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని కాలనీలకు మెరుగైన వసతులు కల్పిస్తామని కార్పొరేటర్ తెలిపారు.

## ఆర్థిక అవగాహన పెంచేందుకు "సమీక్ష" సిరీస్.. పిరమిల్ ఫైనాన్స్ కొత్త ప్రయోగం..!




దేశంలోని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రుణ సంస్థల్లో ఒకటి పిరమిల్ ఫైనాన్స్. కంపెనీ మొత్తం వ్యాపారంలో తెలంగాణ వాటా దాదాపు 10 శాతం వరకు ఉంది. తెలంగాణలో మొత్తం రుణాల విలువ రూ.5వేల 200 కోట్ల వరకు వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించింది. కంపెనీ ప్రధానంగా కస్టమర్ల వ్యాపారాన్ని అర్థం చేసుకోవటం వారి కుటుంబ ఆదాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుని రుణాల మంజూరుకు ముందుకెళుతుందని.. కేవలం సిబిల్ స్కోర్ మాత్రమే ప్రామాణికంగా తీసుకోబోమని వెల్లడించింది. బేసిక్ గా హోమ్ లోన్స్, ప్రాపర్టీపై లోన్స్, బిజినెస్ లోన్స్, అన్ సెక్యూర్డ్ బిజినెస్ లోన్స్ అందిస్తూ కస్టమర్లకు తమ ఆశయాలను నెరవేర్చుకోవటంలో సహాయం చేస్తున్నట్లు కంపెనీ చెప్పింది. సాధారణంగా రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్య రుణాలు పొందుతున్న కస్టమర్లు తమకు ఎక్కువగా ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వ్యాపారం పెరుగుతున్నందున రానున్న కాలంలో రిటైల్ బ్రాంచ్ ల సంఖ్యను మరింతగా విస్తరించే ప్రణాళికలో ఉన్నామని.. అలాగే కస్టమర్లకు రుణం ఇచ్చే విషయంలో ఏఐ టూల్స్ కూడా వాడుతున్నట్లు వెల్లడించారు పిరమిల్ ఫైనాన్స్ ప్రతినిధులు. ఈ క్రమంలో కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకునేందుకు వారి వ్యాపారం, ఆదాయం, ఖర్చులను అంచనా వేసేందుకు రుణం కోసం సంప్రదించినప్పుడు వారి వ్యాపార స్థలానికి వెళ్లి వివరాలు కనుక్కొని, కొంత సమయం వారికి కేటాయిస్తామని అదే తమ బిజినెస్ మోడల్ సక్సెస్ అని కంపెనీ చెబుతోంది. అందుకే నిరర్థక రుణాల సంఖ్య మొత్తం లోన్ పోర్ట్ ఫోలియోలో1 శాతం కంటే తక్కువగా ఉన్నట్లు వెల్లడించారు. తాజాగా కంపెనీ నిజ జీవితంలో ఒక వ్యక్తి ఆర్థిక సవాళ్లను ఎదుర్కొని ఎలా ముందుకు సాగి తన జీవిత లక్ష్యాలను చేరుకోవటానికి సంబంధించి 'సమీక్ష' పేరుతో ఒక డిజిటల్ సిరీస్ వీడియోను రూపొందించింది. ఇందులో ప్రముఖ నటుడు బ్రహ్మాజీ నటించారు. ప్రస్తుతం ఈ సిరీస్ యూట్యూబ్ తో పాటు జియో స్టార్, సన్ నెక్స్ట్ లో అందుబాటులో ఉంది. ఇది ప్రజల్లో అవగాహనను పెంచటంతో పాటు తెలంగాణ ప్రజలకు తమను మరింత చేరువచేస్తుందని భావిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కంపెనీకి 517 బ్రాంచ్ లు ఉండగా రానున్న కాలంలో వీటిని వెయ్యికి పెంచే లక్ష్యంతో ఉన్నట్లు వారు వెల్లడించారు. తమ కస్టమర్లలో 80 శాతం మంది మెట్రోలకు సమీపంలోని టైర్ 2,3 ప్రాంతాలకు చెందినవారేనని కంపెనీ చెబుతోంది.

## నాకు ఎందుకు ఇలా అనిపిస్తుంది..: బెంగళూరు లైఫ్ స్టైల్ పై మహిళా టెక్కీ ఆవేదన..

బెంగళూరులో జాబ్ చేయడం వల్ల కలిగే ఒంటరితనం, భావోద్వేగం గురించి ఒక మహిళా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ విచారం వ్యక్తం చేశారు. భారతదేశ టెక్నాలజీ హబ్లో పనిచేసిన అనుభవాన్ని చెప్పుకుంటూ ఆఫీసులో ఇంకా పేయింగ్ గెస్ట్ హాస్టల్లో ఒంటరిగా అయిపోతున్నానని అన్నారు. బెంగళూరులో నేను దెయ్యంలా ఎందుకు భావిస్తున్నాను ? ఇది సాధారణమా? అనే పోస్ట్‌తో ఆమె తన బాధను వ్యక్తం చేశారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి, ఫుల్ టైం ఉద్యోగంలో చేరిన కూడా ఆమెని ఒంటరితనం వేధిస్తోందని చెప్పారు. తన ఫ్రెండ్స్ అందరు దూరంగా ఉంటున్నారని, కానీ ఒక ఫ్రెండ్ తనతో రోజు ఉండే అతను కూడా వేరే చోటికి మారడంతో మరింత ఒంటరినయ్యానని ఆమె తెలిపారు.

ఆమె పనిచేస్తున్న టీం మొత్తం పురుషులతో ఉండటం వల్ల, ఆమెను చిన్నచిన్న విషయాల్లో కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఉంటున్న పేయింగ్ గెస్ట్ (%ూ+%) హాస్టల్లో రూమ్మేట్స్ కూడా ఆమెతో మాట్లాడకపోవడం వల్ల ఏడ్చినా, నవ్వినా పట్టించుకునేవారు లేరని వాపోయారు.

ఈ పోస్ట్ వైరల్ అవ్వడంతో చాలామంది సోషల్ మీడియా యూజర్లకు స్పందించారు. కొందరు ఆమె అనుభవాన్ని షేర్ చేసుకుంటూ ఈ వయస్సులో ఇలాంటివి సాధారణమని అనగా, మరికొందరు ఆమెకు కొత్త కమ్యూనిటీలలో చేరమని, ఏదైనా హాబీలు అలవాటు చేసుకోమని సలహా ఇచ్చారు. ఇంకొకరు బెంగళూరులో డబ్బు సంపాదించి వరల్డ్ టూర్ చేయండి. మిమ్మల్ని మీరు ఫిట్‌గా ఉంచుకోండి. మీరు ఎక్కడ ఉన్నా వర్క్ లైఫ్ ఒంటరిగానే ఉంటుంది అన్నారు. ఇదే విషయం పై మరో ఘటన కూడా బెంగళూరు వాతావరణంపై చర్చకు దారితీసింది. ఇద్దరు దంపతులు బెంగళూరు వదిలి వెళ్తున్నట్లు చెప్పారు. బెంగళూరులో కాలుష్యం కారణంగా ఆరోగ్యం క్షీణిస్తోందని, గతంలో స్వచ్ఛమైన గాలి ఉండేదని కానీ ఇప్పుడు అది కరువైందని అన్నారు. ఫిబ్రవరిలో గాలి నాణ్యత సూచిక (%ూు×%) 297కి చేరిందని, ఇది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

## మాతో టచ్‌లో ఆరుగురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు: బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు




బీఆర్ఎస్?కు చెందిన ఆరుగురు మాజీ ఎమ్మెల్యేలు తమతో టచ్?లో ఉన్నట్టు బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు చెప్పారు. చాలా మంది నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారని, ఈ నెల 10వ తేదీన గువ్వల బాలరాజు పార్టీలో చేరతారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేసుకునే ప్రసక్తి లేదని కుండబద్దలు కొట్టారు. రానున్న రోజుల్లో చాలా మార్పులు ఉంటాయని, చాలా మంది పార్టీలో చేరతారని అన్నారు. చాలా మంది నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. అందరు నాయకులనూ కలుపుకొని ముందుకు వెళ్తామని చెప్పారు. రేవంత్?కు బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే చిత్తశుద్ధి లేదన్నారు. రాహుల్ గాంధీ ప్రైమ్ మినిస్టర్ అయ్యేది లేదని, బీసీలకు ఇచ్చేది లేదని అన్నారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తుందని చెప్పారు.

# రష్యా నుంచి ఆయిల్ దిగుమతి ఆపేస్తే ఇండియాకు లక్ష కోట్ల భారం: SBI రిపోర్ట్




రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపేయాలని ఇండియాపై యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారు. రష్యా నుంచి దిగుమతులను ఆపకుంటే డబల్ టారిఫ్ లు తప్పవని.. అదనంగా 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇండియా ఇంపోర్ట్స్ ఆపకుంటే ఆగస్టు 27 నుంచి టారిఫ్ లు అమలవుతాయని హెచ్చరించారు. ఈ తరుణంలో ఒకవేళ రష్యా నుంచి ఆయిల్ దిగుమతులను నిలిపివేస్తే ఇండియాకు ఎంత నష్టం వాటిల్లనుందో %ూదీ×% రిపోర్ట్ విడుదల చేసింది.

రష్యా నుంచి దిగుమతి ఆపి ఆమెరికా తదితర దేశాలతో ఆయిల్ కొనుగోలు చేస్తే భారత్ దాదాపు రూ. 80 వేల కోట్లు (9 బిలియన్ డాలర్లు) ఆర్థిక భారం పడనుందని రిపోర్టులో పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరంలోనే ఇంతటి నష్టం వాటిల్లనుందని వెల్లడించింది. అదే విధంగా 2027 ఆర్థిక సంవత్సరం నాటికి లక్షా నాలుగు వేల కోట్ల (12 బిలియన్ డాలర్లు) భారం పడనుందని పేర్కొంది. రష్యా నుంచి భారత్ భారీ డిస్కౌంట్ లో క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అయితే రష్యా నుంచి కొనటం ఆపేసి తమతో కొనాలని ట్రంప్ ఒత్తిడి తెస్తున్నాడు. అందుకోసం టారిఫ్ లను ఉపయోగించుకుంటున్నాడు. అంత డిస్కౌంట్ ను కాదని యూఎస్ తో ఆయిల్ కొంటే ఇండియాకు భారీ నష్టం తప్పదు.

రష్యా నుంచి భారత్ 2022 నుంచి క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంటోంది. ఉక్రెయిన్ తో యుద్ధం కారణంగా రష్యాపై వెస్ట్రన్ కంట్రీస్ సాంక్షన్స్ విధించాయి. అంటే యూరోప్, యూఎస్ తదితర దేశాలు రష్యా ఆయిల్ కొనుగోలుపై నిషేధం విధించాయి. దీంతో తక్కువ ధరకే ఆయిల్ అమ్ముతామని ఇండియకు ఆఫర్ చేసింది రష్యా. అప్పటి నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ ను రష్యానుంచే ఇంపోర్ట్ చేసుకుంటూ వస్తోంది. 2020 లో రష్యా నుంచి కొంటున్న ఆయిల్ 1.7 శాతం ఉండగా.. 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 35.1 శాతానికి పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా 2025 లో ఇండియా దిగుమతి చేసుకునే 245 మిలియన్ మెట్రిక్ ఆయిల్ లో.. రష్యా నుంచే 88 మిలియన్ మెట్రిక్ టన్నులు ఉండటం గమనార్హం.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆయిల్ ప్రొడక్షన్ లో రష్యా 10 శాతం ఉత్పత్తి చేస్తుంది. ఒకవేళ అన్ని దేశాలు రష్యా నుంచి కొనుగోలును ఆపేస్తే.. ధరలు 10 శాతం మేరకు పెరగనున్నట్లు ఎస్బీఐ రిపోర్ట్ అంచనా వేసింది. ఇది ఇండియాకే కాదు.. ప్రపంచంలోని అన్ని దేశాలపై ప్రభావం చూపిస్తుందని పేర్కొంది. అయితే ఇండియా కేవలం రష్యాపైనే ఆధారపడకుండా.. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏయీ తదితర మరో 40 దేశాల నుంచి ఆయిల్ ను ఇంపోర్ట్ చేసుకుంటుంది.

# చుడిదార్‌లో ఉన్నానని ఆపేశారు.. రెస్టారెంట్ ముందు దంపతుల వీడియో.. సీఎం ఫైర్



మనలో చాలా మంది వీకెండ్ లేదా పండగ రోజుల్లో ఫ్యామిలీతో కలిసి రెస్టారెంట్‌కి వెళ్తుంటారు. అయితే మీరు మీ ఫ్యామిలీతో లేదా ఫ్రెండ్స్ తో కలిసి సంప్రదాయ దుస్తులలో రెస్టారెంట్‌కి వెళ్తే అక్కడ తినడానికి కూడా డ్రెస్ కోడ్ ఉండాలి అని రూల్ పెడితే మీకు ఎం అనిపిస్తుంది. ఇది రెస్టారెంటా లేక ఆఫీసా అని అనుకుంటారు కదా.. కానీ రెస్టారెంట్‌లో కూడా తినడానికి డ్రెస్ కోడ్ పెట్టడం అనేది అసలు అర్థం లేనిది. ఢిల్లీలో ఉంటున్న ఓ జంట రెస్టారెంట్‌లో తినడానికి వెళ్తే ఇలాగే జరిగింది, కేవలం భారతీయ దుస్తులు వేసుకున్నందుకు వారిని లోపలికి రానివ్వలేదు. వివరాలు చుస్తే ఈ సంఘటన ఢిల్లీలోని పితంపురలోని తుబాటా రెస్టారెంట్‌లో జరిగింది. ఒక జంట అక్కడికి డిన్నర్ చేసేందుకు వెళ్లగా, వాళ్ళు సాంప్రదాయ దుస్తులు ధరించారని లోపలి వెళ్లనివ్వలేదు. ఓ మహిళ కుర్తీ, పైజామా, దుపట్టా ధరించగా ఆమె భర్త సాధారణ టీ-షర్ట్ %ం% జీన్స్ ధరించాడు. కానీ బయట ఉన్న రిసెప్షనిస్ట్ వారిని లోపలికి వెళ్లనివ్వలేదు.ఆ జంట రెస్టారెంట్ బయట నిలబడి నిరసన తెలిపారు. భారతదేశంలో ఉండే ప్రజలు భారతీయ దుస్తులు ధరించి రెస్టారెంట్లలో తినకుండా నిషేధించారని, ఇలాంటి రూల్ భారతీయ సంస్కృతికి విరుద్ధమని ఆగ్రహించారు. ఆ తర్వాత రెస్టారెంట్ మేనేజర్ బయటకు వచ్చి రిసెప్షనిస్ట్ ప్రవర్తనకు క్షమాపణలు చెప్పారు. రెస్టారెంట్ బయట వీడియో: ఈ సంఘటన తర్వాత రెస్టారెంట్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ వీడియోను ఏrose_k01 అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా వైరల్ అయ్యింది. ఈ వీడియోను ఇప్పటివరకు 4 లక్షలకు పైగా చూసారు. అయితే ఈ రెస్టారెంట్ పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మన సంస్కృతికి విరుద్ధమైన ఇలాంటి రెస్టారెంట్లను మూసేయాలి అంటూ ఒకరు, సాంప్రదాయ బట్టలు ధరించి తినడానికి వస్తే అది వాళ్ళ ఇష్టం అని మరొకరు ఇలా కొంతమంది రెస్టారెంట్ పై విమర్శలు కురిపించారు.

ఈ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయిన తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా ఈ విషయంపై స్పందించి దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తరువాత రెస్టారెంట్ క్షమాపణలు చెప్తూ, ఇక ముందు బట్టల పై ఎటువంటి రూల్స్ ఉండవని తెలిపింది.

# TCS మరీ ఇంత దారుణమా.. హెచ్‌ఆర్ చేసిన పనికి టెక్కీ షాక్.. ఏడుపు కూడా..




దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఇటీవల తన లేఆఫ్స్ ప్లాన్ గురించి ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో 12వేల మందిని తగ్గించాలని ప్లాన్ చేసింది టీసీఎస్. అయితే ఇందులో భాగంగా కొత్తగా కంపెనీలో చేరిన ఫ్రెషర్స్ జాబ్స్ కూడా ప్రమాదంలో ఉన్నట్లు వెల్లడైంది. దీనికి సంబంధించిన ఒక షాకింగ్ విషయాన్ని రెడిట్ పోస్టులో తనకు జరిగిన అనుభవాన్ని పంచుకోవటం పెద్ద సంచలనంగా మారింది. టీసీఎస్ ఫ్రెషర్ ఉద్యోగులను ఫైర్ చేస్తోందా అంటూ సదరు టెక్కీ ఆరోపించాడు. సదరు ఫ్రెషర్ కంపెనీ తనను ఇంటికి పంపించిన ప్రక్రియ గురించి చెప్పటంతో అందరూ షాక్ అవుతున్నారు. ముందుగా తనను హెచ్‌ఆర్ తన క్యాబిన్ కి రమ్మని పిరిచారని.. రాగానే వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేయమని చెప్పారని అతడు వెల్లడించాడు. వెంటనే తనను రాజీనామా చేస్తావా లేక తొలగించమంటావా అని రెండు ఆప్షన్స్ ఇచ్చి వెంటనే తేల్చుకోమని చెప్పినట్లు పోస్టులో వెల్లడించాడు. తాము తొలగిస్తే నెటగివ్ రిలీవ్ లెటర్ ఇస్తామని హెచ్చరించినట్లు చెప్పాడు. పైగా ఎలాంటి కంపెన్సేష్ కూడా రాదని హెచ్చరించినట్లు చెప్పాడు.

వ్యక్తిగత కారణాలతో కంపెనీని విడిచి వెళ్లిపోతున్నట్లు పేర్కొంటూ రాజీనామా చేస్తే మూడు నెలల జీతం ఇస్తామని హెచ్‌ఆర్ బెదిరించిన విషయాన్ని రెడిట్ యూజర్ చెప్పాడు. తాను ఒక యాక్టివ్ ప్రాజెక్టులో పనిచేస్తున్నప్పటికీ హఠాత్తుగా ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చిందని బాధపడ్డాడు. అలాగే హెచ్‌ఆర్ తో మాట్లాడుతున్నప్పుడు అయోమయంలో ఉన్నానని, బాధ కలిగిందని చెప్పిన టెక్కీ.. క్యాబిన్ నుంచి బయటకు వెళ్లేటప్పుడు కనీసం కళ్లలో నీళ్లు కూడా కనిపించకుండా చేశారన్నారు. నిర్ణయం తీసుకోవటానికి ముందు తండ్రికి కాల్ చేస్తానంటే హెట్‌ఆర్ అందుకు అంగీకరించలేదని కేవలం 15 నిమిషాల్లో తనతో రాజీనామా చేయించారని వెల్లడించాడు.

హెచ్‌ఆర్ తనపై రాజీనామాకు తీవ్రంగా ఒత్తిడి చేయటంతో చేసేదేమీ లేక సేఫ్ ఆప్షన్ అయిన రాజీనామాను ఎంచుకోవాల్సి వచ్చిందని టెక్కీ చెప్పటంతో టీసీఎస్ అనైతిక విధానాలను ఫాలో అవుతోందని చాలా మంది సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా తొలగింపుల సంఖ్యలను తక్కువగా చూపించేందుకే కంపెనీ ఇలాంటి విధానాలను ఎంచుకుంటోందని మరికొందరు అంటుండగా.. రతన్ టాటా మరణం తర్వాత టాటా యాజమాన్య వైఖరిలో అనేక మార్పులు కనిపిస్తున్నాయనే కామెంట్స్ కూడా చాలా మంది నుంచి వినిపిస్తున్నాయి. మొత్తానికి రెడిట్ యూజర్ తన అనుభవాన్ని పంచుకోవటంతో చాలా మంది డైలమాలో ఉన్నారు. తమను ఎప్పుడు హెచ్‌ఆర్ క్యాబిన్ కి పిలుస్తుందో అనే భయాలతో ఇప్పటికే చాలా మంది ఇతర కంపెనీల్లో ఆఫర్ల కోసం సెర్చ్ చేసుకోవటం స్టార్ట్ చేసేశారు.

# తిరుపతి రైల్వే స్టేషన్ బయట.. భక్తుడిపై ఆటో డ్రైవర్ల దాడి.. వీడియో వైరల్

తిరుమల: తిరుపతి రైల్వే స్టేషన్?లో భక్తుడిపై ఆటో డ్రైవర్లు దాడికి దిగిన ఘటన భక్తుల్లో భయాందోళనలకు కారణమైంది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి భక్తులు తిరుమలకు వెళుతుంటారు. అలాంటి భక్తులపై శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టుకు వెళ్లే ఫ్రీ బస్ స్టాప్ వద్ద ఆటోడ్రైవర్లు దాడికి దిగారు. దాడికి సంబంధించిన వీడియోని కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆటో డ్రైవర్ చెప్పిన రేటుకు భక్తుడు నిరాకరించడంతో అతడిపై తీవ్రంగా దాడి చేసి ఆటో డ్రైవర్లు గాయపరిచారు. తిరుపతి రైల్వే స్టేషన్ దగ్గర ఆటోవాలాల దందా రోజురోజుకు పెరిగిపోతుండటం గమనార్హం.



తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్?ల దగ్గర నుంచి శ్రీవారి మెట్టు వరకు తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేసింది. అయితే సమాచార లోపం కారణంగా భక్తుల్లో గందరగోళం నెలకొంది. ఉచిత బస్సుల టైమింగ్ భక్తులకు తెలియకపోవడంతో శ్రీవారి మెట్టు వరకు భక్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆటోవాలాలు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

22 కిలోమీటర్ల దూరానికి వందలకు వందలు డిమాండ్ చేస్తుండడంతో మరో మార్గం లేక ఆటోవాలాలతో బేరాలు ఆడాల్సి వస్తోంది. వాళ్లు చెప్పిన రేటుకు ఓకే అంటేనే భక్తులను శ్రీవారి మెట్టు వరకు చేరుస్తున్నారు. లేదంటే.. ఇలా భక్తులను దూషిస్తూ.. ఇలా దాడులకు పాల్పడుతూ ఆటో డ్రైవర్లు ప్రవర్తిస్తున్న తీరుపై భక్తులు మండిపడుతున్నారు.

CK చంద్ర కాంత్ NEWS తెలుగు దినపత్రిక

# గుండెలో పిడుగు

యువ గుండెలు ఉన్నట్టుండి చేతులెత్తేస్తున్నాయి. భవిష్యత్తు ఆశలను చిదిమేస్తున్నాయి. అప్పటివరకూ చలాకీగా, చురుకుగా తిరుగుతూ.. నవ్వుతూ తుళ్లుతూ ఆటలాడుతున్నవారిని, వ్యాయామం చేస్తున్న వారిని హఠాత్తుగా కుప్పకూల్చేస్తున్నాయి. ఇలా చిన్నవయసులోనే హఠాన్మరణం పొందటం ఇటీవల తరచూ చూస్తున్నాం. చాలామందికిది విస్మయం, విపరీతమైన భయం కలిగిస్తోంది కూడా. అపోహలకూ దారితీస్తోంది. ఎందుకీ దుస్థితి? దీనికి కారణాలేంటి?

హఠాత్తుగా గుండె స్తంభించి మరణించటమనేది పెద్దవయసువారికే పరిమితమనే భావన పోయింది. ప్రస్తుతం ఎంతోమంది చిన్నవయసులోనూ.. చివరికి పిల్లలూ దీని బారినపడుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు, ఎలాంటి సమస్యలు లేనివారూ దీనికి బలవుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అసలు విషయం ఏంటంటే– పైకి అంతా బాగా ఉన్నట్టు కనిపించినా లోపల ఎలాంటి సమస్యా లేదనుకోవటానికి లేదు. జన్యుపరంగా పుట్టుకతో తలెత్తే కొన్ని గుండెజబ్బులు లోలోపలే ముదురుతూ వస్తుండొచ్చు. చాలామందికివి ఉన్నట్టయినా తెలియదు. ఎప్పుడివి ఉద్ధృతమవుతాయో కూడా ఊహించలేం. తీవ్రమైన శారీరక శ్రమ, వ్యాయామాల వంటివి చేస్తున్నప్పుడు ఉన్నట్టుండి ప్రతాపం చూపించొచ్చు. మన శరీరంలోని అన్ని అవయవాలకూ అవసరమైన ఆక్సిజన్, పోషకాలు రక్తం ద్వారానే సరఫరా అవుతాయి. ఇందుకు గుండె సమర్థంగా పంప్ చేయటం చాలా కీలకం. లేకపోతే మెదడు వంటి కీలక అవయవాలకు తగినంత రక్తం అందక స్పృహ కోల్పోవచ్చు. గుండెలోని విద్యుత్ వ్యవస్థ ఉన్నట్టుండి ప్రేరేపితమైతే, లయ తప్పి స్తంభించిపోవచ్చు. ఇందుకు రకరకాల సమస్యలు దోహదం చేస్తుంటాయి. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది గుండె కండరం మందం కావటం. గుండె కణాలకు ఖనిజ లవణాలను సరఫరా చేసే మార్గాలు దెబ్బతినటం, గుండె లోపాలు, మరీ ఎక్కువగా కొలెస్ట్రాల్ ఉత్పత్తి కావటం వంటివీ కారణమే. వీటిని ముందుగా గుర్తిస్తే తగు జాగ్రత్తలు తీసుకోవచ్చు. పెను విపత్తు సంభవించకుండా కాపాడుకోవచ్చు.

1. గుండె మందం (హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతీ)

గుండె కండరం.. ముఖ్యంగా గదుల మధ్య ఉండే పొర (సెప్టమ్) మందం కావటం పెద్ద సమస్య. దీంతో ఎడమ జఠరిక లోపలి భాగం తగ్గుతుంది. దీంతో రక్తం సరిగా పంప్ కాదు (వెంట్రిక్యులార్ అవుట్‌ఫ్లో అబ్‌స్ట్రక్షన్). ఫలితంగా పనులు, వ్యాయామం చేసేటప్పుడు ఆయాసం కలుగుతుంది. కండరం మందమైతే సరిగా వ్యాకోచించదు కూడా. ఇదీ రక్త సరఫరాను దెబ్బతీస్తుంది. మెదడుకు రక్తం అందకపోతే ఉన్నట్టుండి స్పృహ కోల్పోయే ప్రమాదముంది. కొందరికి కండరం గట్టిపడి మచ్చలా ఏర్పడొచ్చు కూడా. ఇది గుండె విద్యుత్ ప్రసారానికి ఆటంకం కలిగించటం వల్ల హఠాత్తుగా గుండె లయ అస్తవ్యస్తమై (అరిత్మియా), వేగంగా కొట్టు కుంటుంది. కొందరికి నిమిషానికి 300 కన్నా ఎక్కువసార్లు కొట్టుకోవచ్చు. ఇలాంటి స్థితిలో గుండె కండరం సరిగా సంకోచించదు. దీంతో హఠాత్తుగా గుండె స్తంభించొచ్చు (సడెన్ కార్డియాక్ అరెస్ట్). రక్తం సరిగా సరఫరా కాకపోవటం వల్ల ఉన్నట్టుండి స్పృహ తప్పుతుంటారు. కొందరు ఛాతీలో నొప్పితోనూ కుప్పకూలొచ్చు. సత్వరం సీపీఆర్ చేయకపోతే, డిఫిబ్రిలేటర్‌తో షాక్ ఇవ్వకపోతే మరణమూ సంభవించొచ్చు. వీటిని ఎలా చేయాలో ప్రతి ఒక్కరూ నేర్చుకొని ఉండాలి. స్పోర్ట్స్ క్లబ్‌లు, జిమ్‌లలో డిఫిబ్రిలేటర్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడటమూ తప్పనిసరి.

**జన్యువులే కారణం**

గుండె మందం కావటానికి మూలం జన్యు లోపాలే. మన గుండె సంకోచించటంలో యాక్టిన్, మయోసిన్ ప్రొటీన్లు కీలక పాత్ర పోషిస్తాయి. మయోసిన్ తయారీకి తోడ్పడే జన్యువులో లోపముంటే కండ మందమవుతూ వస్తుంటుంది. కుటుంబంలో ఎవరికైనా ఇది ఉన్నట్టయితే తర్వాత తరానికి 50% వరకూ వచ్చే అవకాశముంది. అందువల్ల కుటుంబం మొత్తం ముందు జాగ్రత్తగా 2డీ ఎకో పరీక్ష చేయించుకోవటం మంచిది. దీంతో ముందుగానే సమస్యను పట్టుకోవచ్చు. ఈ పరీక్షను 12 ఏళ్ల వయసు నుంచే మొదలెట్టాలి. ప్రతి మూడేళ్లకోసారి 21 ఏళ్లు వచ్చేవరకూ చేయించుకోవాలి. ఈ లోపు సమస్య ఎప్పుడైనా బయటపడొచ్చు. 21 ఏళ్లు దాటాక ప్రతి ఐదేళ్లకోసారి పరీక్ష చేయించుకుంటే చాలు.

**రెండు రకాలు**

మధ్యగోడ మందమై, గుండెలోంచి రక్తం బయటకు రావటం తగ్గటం అబ్‌స్ట్రక్టివ్ రకం. ఇది ప్రమాదకరమైంది.

గుండె మందమైనా, రక్త సరఫరాలకు విఘాతం కలగకపోవటం నాన్ అబ్‌స్ట్రక్టివ్. వీరికి కుప్పకూలటం, హఠాత్తుగా గుండె స్తంభించటం వంటి ఇబ్బందులేవీ ఉండవు. కాకపోతే పనులు చేస్తున్నప్పుడు ఆయాసం కలగొచ్చు. మందులు వాడుకుంటే చాలావరకూ హాయిగా జీవించొచ్చు.

**ఎలా తెలుసుకోవాలి?**

గుండె మందం కావటం ఈసీజీ పరీక్షలో కొంతవరకు తెలుస్తుంది. 2డీ ఎకోతో పూర్తిగా బయటపడుతుంది. కొన్నిసార్లు 24 గంటల పాటు ఈసీజీని నమోదు చేసే హోల్టర్ పరీక్ష చేయాల్సి ఉంటుంది. కొందరికి ఎమ్మారై పరీక్షా అవసరపడొచ్చు. ఇందులో మామూలు కండరం, మచ్చ ఏర్పడిన భాగం ఎంతెంత ఉన్నాయో బయటపడతాయి. జన్యులోపాన్ని పరీక్షతో గుర్తించే అవకాశమూ ఉంది. కాకపోతే మయోసిన్ జన్యులోపమే కాకుండా ఇతరత్రా జన్యులోపాలూ కారణమవుతాయి కాబట్టి ఇందత సులభమైన పని కాదు.

మందులు, చికిత్స మార్గాలు

గుండె కండరం మందమైనవారు కఠినమైన వ్యాయామాలు, తీవ్ర శారీరక శ్రమకు గురిచేసే ఆటలకు దూరంగా ఉండాలి. అలాగే కొన్ని మందులు, చికిత్సలూ ఉపయోగపడతాయి.

మందులు: గుండె కండరాన్ని వ్యాకోచించేలా చేసే డైసోపిరమైడ్, అలాగే బీటా బ్లాకర్ల వంటి మందులు ఆయాసం వంటివి తగ్గటానికి తోడ్పడతాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకోవటం ముఖ్యం.

శస్త్రచికిత్స: మధ్య గోడ బాగా మందమైతే శస్త్రచికిత్సతో ఆ భాగాన్ని తొలగించొచ్చు (మయోమెక్టమీ). దీంతో రక్త సరఫరాకు ఆటంకం తొలగి, ఉపశమనం కలుగుతుంది.

ఆల్కహాల్‌తో మాడ్చటం: మధ్య గోడకు రక్తాన్ని సరఫరా చేసే నాళంలోకి ఆల్కహాల్‌ను పంపించటం మరో పద్ధతి. దీన్నే ఆల్కహాల్ సెప్టల్ అబ్లేషన్ అంటారు. దీంతో మందమైన భాగానికి రక్త సరఫరా తగ్గిపోయి, సన్నబడుతుంది. ఇది ఐదారేళ్ల వరకూ ఇబ్బందులు కలగకుండా చూస్తుంది.

ఐసీడీ పరికరం: గుండెలో మధ్య గోడ మందం 3 సెం.మీ. కన్నా మించితే హఠాత్తుగా చనిపోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. గుండె కండరంలో మచ్చ 15% కన్నా ఎక్కువగా ఉన్నవారికీ ఈ ప్రమాదం పొంచి ఉంటుంది. ఇలాంటివారికి ఛాతీ లోపల ఐసీడీ (ఇంట్రా కార్డియాక్ డిఫిబ్రిలేటర్) పరికరాన్ని అమర్చటం మేలు చేస్తుంది. ఇది గుండె వేగం బాగా పెరిగినప్పుడు షాక్ ఇవ్వటం ద్వారా తిరిగి మామూలు స్థితికి తీసుకొస్తుంది.

ఐసీడీతోనూ ఫలితం లేకపోతే జీవితం దుర్భరంగా తయారవుతుంది. ఇలాంటి వారికి జన్యు చికిత్స ఉపయోగపడుతుంది. కాకపోతే ఇదింకా మనదేశంలో అందుబాటులో లేదు.

ప్రస్తుతం జన్యువును మార్చే పద్ధతుల మీదా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి సఫలమైతే అసలు జబ్బు బారినపడకుండానే చూసుకోవటం సాధ్యమవుతుంది.

**అనుమానించేదెలా?**

ఆటలాడుతున్నప్పుడో, పరుగెత్తుతున్నప్పుడో, వ్యాయామాలు చేస్తున్నప్పుడో ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవటం, ఛాతీలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నట్టయితే గుండె కండరం మందమై ఉండొచ్చని అనుమానించటం తప్పనిసరి.

క్రీడాకారుల గుండె ప్రత్యేకం

క్రీడాకారులు రోజూ తీవ్రమైన కసరత్తులు చేస్తుంటారు కదా. వీరిలోనూ గుండె కండరం మందమవుతుంది. అయితే ఇదేమీ సమస్య కాదు. ఇది శారీరక శ్రమకు తగ్గట్టుగా అవయవాలకు తగినంత రక్తాన్ని సరఫరా చేయటానికి గుండె చేసుకునే సర్దుబాటు. వీరిలో గదుల మధ్య గోడ మాత్రమే కాదు, గుండె మొత్తమూ మందమవుతుంది. గుండె గదుల సైజూ పెరుగుతుంది. గుండె కూడా చాలా నెమ్మదిగా కొట్టుకుంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి సూచికే గానీ సమస్య కాదు. గుండె సంకోచించటం, పంపింగ్ సమర్థంగా సాగుతాయన్నమాట. ఫిట్‌నెస్ కోసం విపరీతంగా వ్యాయామాలు చేసేవారిలోనూ ఇలా ఉండొచ్చు.

**2. కణ మార్గ సమస్యలు**

ఈసీజీ, ఎకో పరీక్షల్లో ఎలాంటి మార్పులు లేకపోయినా కొందరు హఠాత్తుగా కుప్పకూలుతుండటం చూస్తున్నాం. దీనికి ప్రధాన కారణం గుండె కణాల మార్గాలు అస్తవ్యస్తం కావటం (ఛానెలోపతీ). గతంలో ఇది అంతగా తెలిసేది కాదు. ఐదారేళ్లుగా బాగా గుర్తించగలుతున్నారు. ప్రతి కణానికీ సోడియం, పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలు అవసరం. ఇవి అతి సూక్ష్మమైన మార్గాల ద్వారా వస్తూ పోతుంటాయి. ఒకవేళ గుండె కణాల్లో సోడియం మార్గాల పనితీరు దెబ్బతింటే ఖనిజ లవణాల సమతుల్యత లోపిస్తుంది. దీంతో గుండె లయ అస్తవ్యస్తమై, ఉన్నట్టుండి వేగం పెరిగిపోతుంది. దీంతో హఠాత్తుగా కుప్పకూలుతారు. కణమార్గ సమస్యల్లో కొన్నింటిని ఈసీజీ ద్వారా గుర్తించే అవకాశం ఉండటం గమనార్హం.

క్యూటీ సిండ్రోమ్: ఈసీజీ పరీక్షలో క్యూ, టీ తరంగాల మధ్య వ్యవధి ఎక్కువగా (లాంగ్ క్యూటీ), మరీ తక్కువగా (షార్టెన్డ్ క్యూటీ) ఉన్నట్టయితే గుండె లయ అస్తవ్యస్తం కావటం, హఠాత్తుగా గుండె ఆగి చనిపోయే ముప్పు ఎక్కువని చెప్పుకోవచ్చు.

బ్రుగాడా సిండ్రోమ్: విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడు, కడుపు నిండా తిన్నప్పుడు హఠాత్తుగా గుండె వేగం పెరిగి, మరణం సంభవించేలా చేయటం దీని ప్రత్యేకత. నిద్ర పోతున్నప్పుడు చిన్నవయసులోనే మరణించటానికి చాలావరకూ ఇదే కారణం.

క్యాటకాలమిన్ వీటీ: ఇది ఈత, పరుగు వంటి కఠిన వ్యాయామాలు చేస్తున్నప్పుడు గానీ తీవ్ర భావోద్వేగాలకు గురైనప్పుడు గానీ తలెత్తుతుంది. సింపథెటిక్ నాడీ వ్యవస్థ అతిగా స్పందించటం మూలంగా అడ్రినలిన్, నార్ అడ్రినలిన్, కార్టిజోల్ వంటి హార్మోన్ల మోతాదులు ఉన్నట్టుండి ఎక్కువై గుండె వేగంగా కొట్టుకుంటుంది. నిమిషానికి 300, 400 సార్లూ కొట్టుకోవచ్చు. మామూలు సమయాల్లో వీరిలో ఈసీజీ, ఎకో పరీక్షల వంటివన్నీ నార్మల్‌గా ఉండటం గమనార్హం. అందుకే ఇది సమస్యను గుర్తించటంలో చాలామందిని బోల్తా కొట్టిస్తుంది. 35 ఏళ్ల లోపు వయసువారు వ్యాయామం చేస్తున్నప్పుడు హఠాత్తుగా గుండె స్తంభించి, మరణించటానికి ప్రధాన కారణం ఇదే.

– ఈ సమస్యలకు మందులతో పెద్దగా ప్రయోజనమేమీ ఉండదు. కొందరికి ఛాతీలో సింపథెటిక్ నాడుల గొలుసును కత్తిరించటం (సింపథెక్టమీ) ద్వారా అడ్రినలిన్, నార్ అడ్రినలిన్ ఉద్ధృతి తగ్గి, ఉపశమనం కలగొచ్చు.

**3. గుండె లోపాలు**

కొందరికి పుట్టుకతోనే గుండె లోపాలు ఉండొచ్చు. వీటిల్లోనూ కొన్ని గుండె హఠాత్తుగా స్తంభించేలా చేయొచ్చు. వీటిల్లో ఒకటి అరిత్మోజెనిక్ రైట్ వెంట్రిక్యులార్ కార్డియోమయోపతీ (ఏఆర్‌వీసీ). పది పదిహేనేళ్ల వయసులో గుర్తిస్తే మందులతో కొంత కాలం గుండె లయ తప్పకుండా చూడొచ్చు.

**4. అతి కొలెస్ట్రాల్**

గుండె రక్తనాళాల్లో పూడికలు కొందరిలో చిన్నవయసులోనూ కనిపిస్తుంటాయి. దీనికి ప్రధాన కారణం వంశపారంపర్యంగా రక్తంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటం (ఫెమీలియల్ హైపర్‌కొలెస్ట్రీమియా). వీరిలో కొలెస్ట్రాల్ 500కు దాటుతుంటుంది కూడా. దీని మూలంగా ఏర్పడే పూడికలతోనూ హఠాత్తుగా గుండెపోటు రావొచ్చు. అధిక కొలెస్ట్రాల్‌ను ముందే గుర్తిస్తే మందులతో తగ్గేలా చేయొచ్చు.

**5. ధమనులు అస్తవ్యస్తం**

గుండె నుంచి రక్తాన్ని తీసుకొచ్చే మూడు ధమనులు ఒక క్రమ పద్ధతిలో అమరి ఉంటాయి. కొందరిలో ఇవి పుట్టుకతోనే అస్తవ్యస్తంగా ఉండొచ్చు. దీంతో వ్యాయామం చేస్తున్నపుడ%ళి%్న హఠాత్తుగా కుప్పకూలుతుంటారు. ధమనుల లోపాలను సర్జరీతో సరిచేయొచ్చు.

**6. జీవ రసాయనాలు పెరగటం**

కొలెస్ట్రాల్ పంపిణీలో తోడ్పడే లైపోప్రోటీన్ ఏ, హోమోసిస్టీన్, ఏపోబీ అనే జీవ రసాయనాల మోతాదులు ఎక్కువగా ఉన్నా చిన్న వయసులో గుండెపోటు రావొచ్చు. ఎందుకంటే ఇవి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తాయి. అందువల్ల కుటుంబంలో ఎవరికైనా గుండెజబ్బులు ఉన్నట్టయితే చిన్నవయసువారు వీటి మోతాదులను పరీక్షించుకోవటం మంచిది.

# మొటిమంత బెంగ

**ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు.**



**ఇది మొటిమల అవగాహన మాసం**

ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు. తెగ ఆందోళన పడిపోతుంటారు. మనో వేదనకూ గురవుతుంటారు. మొటిమల మీద లెక్కలేనన్ని అపోహలూ రాజ్యమేలుతుండటం, సరైన అవగాహన లేకపోవటమే దీనికి కారణం.

అప్పటివరకూ నునుపుగా ఉన్న ముఖం మీద ఏంటీ మొటిమలు? ఒకట్రెండు కాస్తా చూస్తుండగానే సంఖ్య పెరుగుతూ వస్తోందేంటి? అందానికి, ఆకర్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చే యుక్తవయసువారిలో ఇలాంటి ఆలోచనలే ముసురుకుంటుంటాయి. ఇంతకీ ఇవి ఎలా పుట్టుకొస్తాయి? ఆశ్చర్యంగా అనిపించినా చర్మం నిగనిగలాడుతూ కనిపించటానికి తోడ్పడే చమురు గ్రంథులే మొటిమలకు కారణం! శరీరం మీద చర్మం అంతటా సన్నటి వెంట్రుకలు, వాటి కుదుళ్లుంటాయి. ప్రతి కుదురులో వెంట్రుక మొదలు (ఫాలికల్), చమురు గ్రంథులు (సెబేషియస్ గ్లాండ్స్) ఉంటాయి. గ్రంథుల నుంచి ఉత్పత్తయ్యే చమురు సన్నటి రంధ్రాల ద్వారా బయటకు వస్తుంది. ముఖం, ఛాతీ, వీపు, భుజాలు, చేతుల మీద ఈ గ్రంథులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఇవి వాచి, ఉబ్బి.. గుల్లల మాదిరిగా పైకి పొడుచుకు రావటమే మొటిమలకు మూలం. కొందరిలో జన్యుపరంగా టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు గ్రంథులను ప్రేరేపితం చేయటం వల్ల మరింతగా చమురు ఉత్పత్తి అవుతుంది. మరోవైపు చర్మ రంధ్రాల్లో ప్రొపిని బ్యాక్టీరియం ఆక్నీస్ అనే బ్యాక్టీరియా చమురును కొవ్వు ఆమ్లాలుగా విడగొడుతుంటుంది. ఈ ఆమ్లాలు వెంట్రుక కుదురును ప్రేరేపించే క్రమంలో కెరటిన్ పదార్థం ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, చర్మ రంధ్రాలు మూసుకుపోవచ్చు. దీంతో అక్కడ ఉబ్బుగా, గుల్ల మాదిరిగా ఏర్పడి.. మొటిమ తలెత్తుతుంది. ఇది క్రమంగా పెద్దగా అవుతూ రావొచ్చు. కొన్నిసార్లు చర్మ రంధ్ర మార్గం పగిలి, వాపు మొదలవ్వచ్చు. ఫలితంగా అక్కడ ఎర్రబడి, మొటిమ పొక్కులా పొడుచుకొస్తుంది. లోపల చీము చేరటం, చితకటం, గుంతలు పడటం.. అన్నీ దీని పర్యవసానాలే.

**నాలుగు రకాలు**

సాధారణంగా మనం మొటిమలన్నింటినీ ఒకే గాటన కట్టేస్తుంటాం. కానీ తెలుపు లేదా నలుపు గుల్లలు (బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్), చీము గుల్లలు (పక్కులె), తిత్తులు (సిస్ట్స్).. ఇలా మొటిమలు రకరకాలుగా ఉంటాయి. తీవ్రతను బట్టి వీటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు.

గ్రేడ్ 1: చాలా సన్నగా, చిన్నగా ఉండేవి (కొమెడోన్స్). వైట్‌హెడ్స్, బ్లాక్‌హెడ్స్ ఇలాంటివే.

గ్రేడ్ 2: బ్లాక్‌హెడ్స్ ఇన్‌ఫెక్షన్‌కు గురై, చీము పట్టడం (పస్ట్యు లర్).

గ్రేడ్ 3: గుల్లలు ఇన్‌ఫెక్షన్‌తో వాచి, గడ్డ మాదిరిగా అవటం (నాడ్యులర్).

గ్రేడ్ 4: గడ్డ మరీ పెద్దగా, లావుగా ఉబ్బటం (నాడ్యులోసిస్టిక్).

ఆడవారిలో ఎక్కువ

మగవారిలో కన్నా ఆడవారికి మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. ఎందుకంటే వీరిలో హార్మోన్ల వ్యత్యాసాలు ఎక్కువ. ఆడవారిలో అండాశయాల్లో నీటి తిత్తులు (పీసీఓడీ), నెలసరి సరిగా రాకపోవటం, థైరాయిడ్ పనితీరు దెబ్బతినటం, టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులు అస్తవ్యస్తం కావటం వంటివీ మొటిమలు ఎక్కువగా వచ్చేలా చేయొచ్చు.

ఏ వయసులోనైనా..

మొటిమలు యుక్తవయసులోనే వస్తుంటాయని, ఆ తర్వాత వాటంతటవే పోతాయని చాలామంది భావిస్తుంటారు. నిజానికి వీటికి ఒక వయసంటూ లేదు. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా రావొచ్చు. కానీ సగటున 10–25 ఏళ్ల వయసులో ఎక్కువగా చూస్తుంటాం. అలాగని అక్కడితోనే ఆగిపోతాయని కచ్చితంగా చెప్పలేం. కొందరికి 20ల్లో, 30ల్లో, 40ల్లోనూ రావొచ్చు. కొందరు మహిళలకు యుక్తవయసులో కొద్దిగానే మొటిమలు వచ్చినా పెద్దయ్యాక తీవ్రంగానూ వేధించొచ్చు.

**ముఖం మీదే కాదు..**

మొటిమలు చాలావరకు.. 99% ముఖం మీదే వస్తుంటాయి. నుదురు, బుగ్గలు, ముక్కు మీద ఇవి కనిపిస్తుంటాయి. చమురు గ్రంథులు లేకపోవటం వల్ల పెదవులు, పెదవుల పైభాగంలో మాత్రం రావు. కొందరికి ముఖం మీదే కాదు.. ఛాతీ, వీపు, చేతుల మీద కూడా రావొచ్చు.

**గిల్లితే తగ్గవు**

మొటిమలను గిల్లి, నొక్కి పిండితే త్వరగా తగ్గుతాయని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. గిల్లితే మొటిమలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శాశ్వతంగా మచ్చలు పడొచ్చు. ఇన్‌ఫెక్షన్ మరింత లోతుకు చొచ్చుకెళ్లి ముఖం మీద గుంతలు పడే ప్రమాదముంది. ఒకసారి గుంత పడితే పూర్తిగా మామూలు స్థాయికి తీసుకొచ్చే చికిత్సలేవీ లేవు. కాకపోతే గుంతల లోతును తగ్గించి, అంతగా కనిపించకుండా చేయొచ్చు.

**గట్టిగా రుద్ది కడిగితే పోవు**

ముఖాన్ని గట్టిగా, రుద్ది కడిగితే మొటిమలు పోతాయనుకోవటం అపోహ. దీంతో మొటిమలు తగ్గటం అటుంచి, మరింత ఎక్కువవుతాయి. ఇన్‌ఫెక్షన్ లోపలికి వెళ్లిపోయి, గుంతలు పడే అవకాశముంది. గట్టిగా రుద్దటం కన్నా రోజుకు రెండు సార్లు మృదువుగా తేలికైన, పరిమళం లేని క్లీన్సర్‌తో ముఖాన్ని కడుక్కోవటం మంచిది. వేలి చివర్లతో క్లీన్సర్‌ను ముఖానికి రాసుకోవాలి. అనంతరం గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి.

కొందరు చర్మం రంధ్రాలు విప్పారతాయనే భావనతో ఆవిరి స్నానాలు చేస్తుంటారు. కానీ వీటితో మొటిమలు మరింత ఎక్కువవుతాయి.

**ఆహారంతో పరోక్ష సంబంధం**

రాత్రిపూట జంక్‌ఫుడ్ తిన్నా.. ఎక్కువ కేలరీల ఆహారం తిన్నా మొటిమలు ఎక్కువగా పుట్టుకురావొచ్చు. ఎందుకంటే శరీరం వాడుకోకుండా మిగిలిన కేలరీలు ఒంట్లో కొవ్వుగా మారతాయి. వీటి నుంచి టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు పుట్టుకొచ్చి మొటిమలను ప్రేరేపిస్తాయి. అందువల్ల సాయంత్రం ఆరు గంటల తర్వాత జంక్‌ఫుడ్, పెద్దమొత్తంలో పిండి పదార్థాలు.. పాల పదార్థాలు (పెరుగు మినహాయించి) తీసుకోవటం మానెయ్యాలి. స్వీట్లు, చాక్లెట్లు, కొవ్వు పదార్థాల వంటివి తగ్గించుకోవాలి.

ఆరోగ్యకరమైన ఆహారంతో మొటిమల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా విటమిన్ ఏతో కూడిన పాలు (పగటిపూట), క్యారెట్, క్యాబేజీ, చిలగడ దుంపలు.. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు గల చేపలు, అక్రోట్లు.. జింక్‌తో కూడిన పదార్థాలు మొటిమలు ఉద్ధృతం కాకుండా కాపాడతాయి.

**పౌడర్ కారణం కాదు**

కొందరు ముఖానికి పౌడర్ రాసుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయని భావిస్తుంటారు. ఇది అపోహ. కాకపోతే గాఢమైన కెమికల్ పీల్స్‌తో చమురు గ్రంథులు ఇంకాస్త పెద్దగా అవ్వచ్చు. ఫలితంగా మొటిమలు ఉద్ధృతం కావొచ్చు. కొన్ని స్టెరాయిడ్ క్రీములతోనూ ఇవి ఎక్కువ కావొచ్చు. కాబట్టి కెమికల్ పీల్స్ వాడకపోవటం మంచిది. సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్లయినా సరే.. నాన్ కొమెడోజెనిక్ రకానికి చెందినవే ఉపయోగించాలి.

**ఒత్తిడికి దూరంగా**

మానసిక ఒత్తిడి, ఆందోళనలు మొటిమలకు కారణం కాకపోయినా అప్పటికే ఉన్నవి ఉద్ధృతమయ్యే అవకాశముంది. కాబట్టి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ధ్యానం, ప్రాణాయామం చేయాలి.

**చికిత్స అవసరమా?**

మొటిమలు ఆరోగ్యానికేమీ హాని కలిగించవు. కానీ వీటితో గుంతలు పడితే జీవితాంతం అలాగే ఉంటాయి. కాబట్టి చికిత్స తీసుకోవటం మంచిది. కొత్తగా మొటిమలు వస్తున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ ఉన్నవి తగ్గకపోతుంటే మాత్రం చికిత్స అవసరం. అలాగే చీము పట్టటం, గడ్డలు ఏర్పడటం, ముఖమంతా నల్లటి మచ్చల్లా మారుతున్నా తాత్సారం చేయరాదు. చికిత్స ఉద్దేశం– మొటిమలు ఉద్ధృతం కాకుండా చూడటం.. తీవ్ర స్థాయి నుంచి స్వల్ప స్థాయికి తీసుకురావటం. సాధారణంగా ఒక వయసు వచ్చేసరికి మొటిమలు నియంత్రణలోకి వస్తాయి. అప్పటివరకూ డాక్టర్ పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే గుంతలు, మచ్చలు పడకుండా చూసుకోవచ్చు.

**ఏంటీ చికిత్స**

మామూలు వైట్, బ్లాక్‌హెడ్స్‌కు రెటినాల్ క్రీములు మేలు. ఇవి గడ్డకట్టిన కెరటిన్ విడిపోయేలా, చర్మ రంధ్రాలు తెరచుకునేలా చేస్తాయి.

చీము పడితే డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

మరీ తీవ్ర మొటిమలకు రెటినాయిడ్, విటమిన్ ఏ మాత్రలు ఉపయోగపడతాయి. ఇవి చమురు ఉత్పత్తిని తగ్గించి, రంధ్రాలు తిరిగి తెరచుకునేలా చేస్తాయి. అయితే వీటిని 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయసువారికే ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు డాక్టర్ సలహా తీసుకోకుండా తమకు తామే విటమిన్ ఏ మాత్రలను వేసుకోవటం ఎక్కువైంది. ఇది ప్రమాదకరం. యుక్తవయసులో ఇవి ఎదుగుదలను, చూపును దెబ్బతీయొచ్చు. సంతానం కోసం ప్రయత్నిస్తున్నవారు, గర్భిణులు, బాలింతలు వీటిని వాడటం మంచిది కాదు. కాబట్టి రక్త పరీక్ష చేయించుకొని, డాక్టర్ పర్యవేక్షణలోనే ఒక వయసు వచ్చేవరకూ వాడి, మానెయ్యాలి.

రెటినాల్ క్రీములు పడనివారికి శాల్సిలిక్ యాసిడ్ పీల్స్ మేలు చేస్తాయి.

మందులతో ఫలితం కనిపించవారికి, మందులు వాడటం కుదరనివారికి లేజర్ చికిత్సతో ఫలితం కనిపిస్తుంది. చికిత్సలతో రాత్రికి రాత్రే మొటిమలు తగ్గుతాయని అనుకోవద్దు. ఇవి పని చేయటానికి 4–8 వారాలు పడుతుంది.

**మచ్చలు, గుంతలు పడితే?**

మొటిమలతో మచ్చలు, గుంతలు పడితే చర్మం రకం, వయసు, జీవనశైలి, మచ్చల రకాన్ని బట్టి డెర్మారోలర్, కెమికల్ పీల్, మైక్రోనీడ్లింగ్ రేడియో ఫ్రీక్వెన్సీ, ఫ్రాక్షనల్ సీవో2 లేజర్, ఎర్బియం యాగ్ లేజర్.. వీటిల్లో ఏదో ఒకదానితో చికిత్స చేయొచ్చు. లేజర్లు చర్మం కిందుండే కొలాజెన్‌ను దెబ్బతీస్తాయి. తర్వాత అక్కడ కొత్త కొలాజెన్ ఏర్పడుతుంది. ఈ క్రమంలో మచ్చలు, గుంతలు తగ్గుతాయి. అయితే గుంతలు పూర్తిగా పోవని గుర్తించాలి. 60–70% మాత్రమే పూడతాయి. గుంతలు ముఖానికి ఇబ్బంది కలిగించటం లేదని అనుకునేంతవరకూ చికిత్స తీసుకోవచ్చు.

# దీపిక రుచిని ప్రభాస్ వదల్లేకపోతున్నాడా!






డార్లింగ్ ప్రభాస్ నాన్ వెజ్ ప్రియుడు. ముక్క లేనిదే ముద్ద దిగదు. తన చుట్టూ ఉండే వాళ్లు కూడా అదే తరహా రుచులని ఆస్వాదించాలనుకుంటాడు. అందుకే తన ఇంటి నుంచి ప్రత్యకంగా వండించి మరీ సహ నటులకు, హీరోయిన్లకు పంపిస్తుంటాడు. ఈ విషయంలో హీరోయిన్లకు ప్రభాస్ ఎంతో ప్రత్యేకం. ప్రభాస్ ఇంట రుచులన్నింటిని దీపికా పదుకొణే కూడా %-%కల్కి%-% షూటింగ్ సమయంలో ఆస్వాదించింది. ప్రభాస్ పంపించిన స్పెషల్ వంటకాల గురించి చెప్పి ఎంతో మురిసిపోయింది. మరి ప్రభాస్ కి దీపికా ఇష్ట వంట కాన్ని రుచి చూపించిందా? అంటే అవుననే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీపికా పదుకొణే ఇష్టంగా తినే ఆహారం ఒకటుంది. అదే క్విన్వో. ఇది పూర్తిగా శాఖాహారం. కూరగాయలు..రకరకాల పప్పులు...మసాలా దినుసులతో ఈ ఐటమ్ తయారు చేస్తారు. రిచ్ కిడ్స్ ఎక్కువగా రిచ్ రెస్టారెంట్ లో ప్రిపర్ చేసే ఐటమ్ ఇది. ఈక్విన్వో దీపిక ఎంతో ఇష్టంగా తింటుందిట. స్వయంగా తాను కూడా చేయడం నేర్చుకుందిట. దీపికకు బాగా తెలిసిన వంటకం కూడా ఇదేనట.భర్త రణవీర్ సింగ్ కూడా స్వయంగా వండి ఎంతో ప్రేమతో వడ్డిస్తుందిట. ఇదే ఐటమ్ ను ప్రభాస్ కోసం దీపిక స్పెషల్ వంటకంగా చేసి తిని పించిందిట. అప్పటి వరకూ ఈ ఐటమ్ గురించి ప్రభాస్ కి కూడా తెలియదట. దీపిక రుచి చూపించడంతో అప్పటి నుంచి రెస్టారెంట్ కి వెళ్లిన ప్రతీసారి తన ఆహారంలో క్విన్వో కూడా ఉండేలా చూసుకుంటున్నాడుట. డార్లింగ్ దీపికను అడిగి రెసిపీ గురించి కూడా అడిగి తెలు సుకున్నాడుట. మొత్తానికి ప్రభాస్ మెచ్చిన వెజ్ వంటకం లిస్ట్ లో కొత్తగా ఇది కూడా యాడ్ అయిందన్న మాట.రాబోయే రోజుల్లో వీరిద్దరి కాంబినేషన్ లో ఇంకెన్ని రుచులు తెరపైకి వస్తాయో చూడాలో. ప్రభాస్ -దీపిక పదుకొణే %-%కల్కి 2%-% షూటింగ్ కూడా పూర్తి చేయాలి. ఇద్దరి మధ్య అసలైన కాంబినేషన్ సన్నివేశాలు రెండవ భాగంలోనే ఉంటాయి. ఈ భాగానికి సంబంధించి షూటింగ్ డేస్ కూడా ఎక్కువగానే ఉన్నాయి. వచ్చే ఏడాది %-%కల్కి 2%-% మొదలవుతుంది.

**గెహ్నా సిప్పీ తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ప్రకాశవంతంగా కనిపిస్తుంది**

**ధనశ్రీ వర్మ సోల్‌ఫుల్ వైబ్‌లను పంచుకున్నారు**



# దేవర2 మొదలయ్యేదప్పుడే!



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ వరుస సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్నారు. ఆఖరిగా దేవర సినిమాతో సక్సెస్ అందుకున్న ఎన్టీఆర్, ఇప్పుడు ఓ వైపు వార్2 సినిమాను రిలీజ్ కు రెడీ చేస్తూనే మరోవైపు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమాను చేస్తున్నారు. ఇందులో వార్2 ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎన్టీఆర్ ఈ సినిమాతోనే బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు.

**హృతిక్ తో కలిసి వార్2**

అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ తో కలిసి జూ. ఎన్టీఆర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ వార్ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతున్న వార్2 పై అందరికీ భారీ అంచనాలున్నాయి. భారీ హైప్ ఉన్న ఈ సినిమా నుంచి రీసెంట్ గా ట్రైలర్ రిలీజవగా అది అప్పటివరకు ఉన్న అంచనాలను తారాస్థాయికి చేరేలా చేసింది.

**డిసెంబర్ కల్లా డ్రాగన్ పూర్తి**

వార్2 ను పూర్తి చేసిన తారక్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్ ను చేయనున్న సంగతి తెలిసిందే. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ చాలా స్టైలిష్ గా తయారయ్యారు. అయితే ఈ సినిమాను నవంబర్ లేదా డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని తారక్ ప్లాన్ చేస్తున్నారట. డ్రాగన్ అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా తర్వాత తారక్ దేవర2 ను చేయబోతున్నారు.

**ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా కొరటాల**

అందులో భాగంగానే కొరటాల ప్రస్తుతం దేవర2కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్, ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా ఉన్నారట. అంతా అనుకున్నట్టు జరిగితే దేవర2 సినిమా జనవరి లేదా ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలు పెట్టాలని చూస్తున్నారట కొరటాల.

దేవర సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కనున్న ఈ సినిమాలో మొదటి భాగంలో ఉన్న చాలా ప్రశ్నలకు సమాధానం దొరకనుండటంతో దేవర2పై భారీ హైప్ నెలకొంది.